నగరం నిప్పులకొలిమి

» ఎండలతో జనం ఉక్కిరిబిక్కిరి

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఒకప్పుడు నడివేసవి కాలంలోనూ సాయంత్రానికి చల్లగాలులు వీచేవి. ఈదురుగాలులతో వర్షం కురిసేది. అటువంటిది వర్షాకాలంలో శ్రావణమాసంలో మాడుపగిలే ఎండ కాస్తోంది. రోజుల తరబడి వర్షం జాడలేదు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా వేడి వాతావరణం కొనసాగుతోంది. ఎండకు భయపడి బయటకు రావాలంటే ప్రజలు వెనుకంజ వేస్తున్నారు. రాత్రి సమయంలో కూడా భూమి నుంచి వేడి సెగలు వస్తున్నాయి. వర్షాకాలంలో ఉండాల్సిన చల్లదనం మచ్చుకైనా

... మిగతా 6వ పేజీలో



ఎండ అధికంగా ఉండడంతో మంగళవారం నిర్మానుష్యంగా మారిన జాతీయ రహదారి



రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా

పోర్టు, కస్టమ్స్ అధికారులకు పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ సూచన

పోర్టు, కస్టమ్స్ అధికారులతో సమావేశమైన మంత్రి నాదెండ్ల

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు సహకరించాలని పోర్టు, కస్టమ్స్ అధికారులను రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ కోరారు. మంగళవారం సాయంత్రం ఆయన నోవాటెల్ హోటల్‌లో పోర్టు, కస్టమ్స్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ

... మిగతా 6వ పేజీలో

గ్రేటర్‌లో రాజకీయ సందడి

నేడు స్టాండింగ్ కమిటీ ఎన్నిక



జీవీఎంసీలో స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు ఏర్పాట్లు

» ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
» ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ పోలింగ్
» అనంతరం లెక్కింపు.. ఫలితాలు వెల్లడి
» కూటమి అభ్యర్థుల గెలుపు లాంఛనమే

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికకు అధికారులు ఏర్పాట్లుపూర్తిచేశారు. ప్రధాన కార్యాలయంలోని పాతకౌన్సిల్‌హాల్‌లో రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటుచేశారు. వచ్చే ఏడాది మార్చి 13 వరకు ఉండే ఈ స్టాండింగ్ కమిటీకి పది మంది సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. దీనికోసం కూటమి తరపున టీడీపీ నుంచి తొమ్మిది మంది, బీజేపీ నుంచి ఒకరు, వైసీపీ నుంచి పది మంది పోటీలో నిలిచారు. కూటమికి 63 మంది, వైసీపీకి 32 మంది సభ్యుల బలం ఉంది. సీపీఐ, సీపీఎంకు ఒక్కొక్కరు చొప్పున కార్పొరేటర్లు ఉన్నారు. వీరిలో జనసేనకు చెందిన 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్‌తోపాటు సీపీఎం కార్పొరేటర్ గంగారావు ఎన్నికను బహిష్కరిస్తున్నట్టు ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

బుధవారం ఉదయం పది గంటలకు పోలింగ్ ప్రారంభమై మధ్యాహ్నం రెండు గంటల వరకు జరుగుతుందని కమిషనర్ కేతన్‌గార్గ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం ఓటుహక్కు కలిగిన కార్పొరేటర్లను మాత్రమే లోపలకు అనుమతిస్తామన్నారు. ఓటు వేసేందుకు వచ్చేవారంతా విధిగా తమ గుర్తింపు కార్డును తీసుకునిరావాల్సి ఉంటుందన్నారు. కౌన్సిల్‌హాల్ బయట ఉండే ఓటర్ ఐడెంటికేషన్ ఆఫీసర్‌కు గుర్తింపు కార్డు చూపించి, స్లిప్పు తీసుకుని పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించాల్సి ఉంటుందన్నారు. పెన్ను, పెన్సిల్, స్మార్ట్‌వాచ్‌లు, సెల్‌ఫోన్‌లు వంటి వాటిని అనుమతించబోమన్నారు. ఒక అభ్యర్థి గరిష్ఠంగా పది మందికి మాత్రమే ఓటు వేయాలని, అంతకుమించి ఓటు వేస్తే చెల్లని ఓటుగా పరిగణిస్తామన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు పోలింగ్ ముగుస్తుందని, అభ్యర్థుల సమక్షంలోనే బ్యాలెట్‌బాక్స్‌లను సీల్ వేస్తామన్నారు. మధ్యాహ్నం భోజనం తర్వాత ఓట్లు లెక్కించి, ఫలితాలను వెల్లడించడం జరుగుతుందన్నారు.

ఓటింగ్‌పై కార్పొరేటర్లపై అవగాహన

స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఓటింగ్ విధానంపై పోటీలో నిలిచిన అభ్యర్థులతోపాటు కార్పొరేటర్లకు మంగళవారం అవగాహన కల్పించారు. అదనపు కమిషనర్లు రమణమూర్తి, ఎస్ఎస్ వర్మలు ఓటు వేసే విధానం, లెక్కింపునకు సంబంధించిన అంశాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికకు సీపీఎం దూరం

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికను

... మిగతా 6వ పేజీలో

యథా కార్పొరేటర్లు! తథా అధికారులు!!

జీవీఎంసీ కౌన్సిల్‌లో చేసిన తీర్మానాలకు దిక్కేది??



తీర్మానాలు అమలు కాకపోయినా పట్టించుకోని ప్రజా ప్రతినిధులు

» దాంతో అధికారుల్లో నిర్లక్ష్యం
» నగర పాలక సంస్థ ఆదాయానికి గండి పడుతున్నా చోద్యం చూస్తున్నవైనం
» వాటికి విలువ లేనప్పుడు రూ.లక్షలు ఖర్చుపెట్టి సమావేశాలు ఎందుకు?
» కొత్త మేయర్ అయినా తీర్మానాలు అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పాత జైలురోడ్డులో అనధికారికంగా నడుస్తున్న నైట్ ఫుడ్‌కోర్టును తొలగించాలంటూ ఈ ఏడాది జనవరి నెలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశారు. ఇప్పటికీ అక్కడ ఫుడ్‌కోర్ట్ కొనసాగుతోంది.

వన్‌టౌన్‌లోని హోల్‌సేల్ ఫ్రూట్‌మార్కెట్‌తోపాటు జ్ఞానాపురంలోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో దుకాణాల అద్దెలు అతిస్వల్పంగా ఉన్నందున వాటిని ప్రస్తుత మార్కెట్ అద్దెలకు అనుగుణంగా పెంచాలని దాదాపు రెండేళ్ల కిందట కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. ఇప్పటికీ వాటి అద్దెల జోలికి వెళ్లలేదు.

స్మార్ట్ సిటీ ప్రాజెక్టు గడువు ముగిసినందున జీవీఎంసీ పరిధిలో ఇకపై స్మార్ట్ సిటీ కార్యకలాపాలను పొడిగించడానికి వీల్లేదని ఈ ఏడాది జూన్ ఆరున జరిగిన కౌన్సిల్ సమావేశంలో మేయర్ స్వయంగా తీర్మానం చేశారు. కానీ నగరంలో చేపట్టబోయే వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల పనులు స్మార్ట్ సిటీ ఆధ్వర్యంలో ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు.

జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో చేసిన తీర్మానాలు క్షేత్రస్థాయిలో అమలుకావడం లేదనడానికి కేవలం ఇవి ఉదాహరణలు మాత్రమే. ఎంతో ఆట్టహాసంగా జరిపే కౌన్సిల్ సమావేశాల్లో పాలకవర్గం చేస్తున్న తీర్మానాలను అధికారులు సీరియస్‌గా తీసుకోవడం లేదు. దీంతో కౌన్సిల్‌లో చేస్తున్న తీర్మానాలు మొక్కుబడిగా మారిపోతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జీవీఎంసీ పరిధిలో రూ.50 లక్షలకు పైబడిన పనులు, ఉద్యోగుల సర్వీస్‌కు సంబంధించిన అంశాలు, నగర పాలక సంస్థకు చెందిన విలువైన ఆస్తుల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్నా సరే కౌన్సిల్‌లో చర్చించిన తర్వాత మెజారిటీ సభ్యుల అభిప్రాయానికి అనుగుణంగా తీర్మానం చేయాల్సి ఉంటుంది. కౌన్సిల్‌లో జరిగే తీర్మానాలను అధికారులు రిజిస్టర్‌లో నమోదుచేసి ఒక్కో తీర్మానానికి ఒక్కో ఆర్డర్ నంబర్ కేటాయిస్తారు. కౌన్సిల్ సమావేశం జరిగిన తర్వాత ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, చేసిన తీర్మానాలను సంబంధిత అధికారులు అమలు చేయడం, తదుపరిచర్యలు తీసుకోవడంపై దృష్టిపెట్టాలి. తర్వాత జరిగే కౌన్సిల్ సమావేశం నాటికి గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై తీసుకున్న చర్యలను సభ్యులకు అందజేయాలి. కానీ పాలకవర్గం ఏర్పడి దాదాపు నాలుగున్నరేళ్లు కావొస్తోంది. కౌన్సిల్

... మిగతా 6వ పేజీలో

హాట్‌కేకుల్లా సీఎస్ఈ సీట్లు

కంప్యూటర్ సైన్స్‌కు కొనసాగిన డిమాండ్

» ఆ తరువాత స్థానంలో ఈసీఈ...
» ఎంసెట్ తొలిదశ కౌన్సెలింగ్ ముగిసేసరికి ప్రముఖ కళాశాలల్లో 'ఏ' కేటగిరీ సీట్లు 90 నుంచి 95 శాతం భర్తీ
» మరికొన్ని కాలేజీల్లో 80 శాతం...
» మేనేజ్‌మెంట్ సీట్లకు గిరాకీ
» సంవత్సరానికి రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షలు వసూలు



విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి తొలి దశ కౌన్సెలింగ్ (ఎంసెట్... ఈఏపీసెట్) ముగిసింది. గతంలో మాదిరిగానే కంప్యూటర్ సైన్స్, ఆ తరువాత ఈసీఈలో చేరేందుకు విద్యార్థులు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. తొలి దశలోనే పేరొందిన కళాశాలల్లో దాదాపు 90 నుంచి 95 శాతం భర్తీ అయినట్టు నిర్వాహకులు చెబుతున్నారు. కొన్ని కళాశాలల్లో 70 నుంచి 80 శాతం భర్తీ అయ్యాయంటున్నారు. గతంలో మాదిరిగానే ఈ ఏడాది కూడా కంప్యూటర్ సైన్స్ సీట్లకు డిమాండ్ కనిపించింది.

ఉమ్మడి విశాఖ జిల్లాలో 24 ఇంజనీరింగ్ కాలేజీలు ఉన్నాయి. వాటిల్లో 19,980 సీట్లను భర్తీ చేసుకునేందుకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) అనుమతి ఇచ్చింది. ఏ కేటగిరీకి సంబంధించి సుమారు 13,986 సీట్లు ఉండగా, తొలి దశ కౌన్సెలింగ్ ముగిసే నాటికి సుమారు 11,000 వరకూ భర్తీ అయినట్టు కళాశాలల ప్రతినిధులు చెబుతున్నారు. కంప్యూటర్ సైన్స్, ఈసీఈ, ఈఈఈ బ్రాంచీల్లో అధికంగా విద్యార్థులు చేరినట్టు ప్రిన్సిపాల్స్ చెబుతున్నారు. గతంలో మాదిరిగానే కంప్యూటర్ సైన్స్‌కు భారీ డిమాండ్ ఏర్పడింది. తొలి దశలో కోరుకున్న బ్రాంచీలో సీటు వచ్చిన విద్యార్థులు చేరిపోగా, రానివారు రెండో విడత కౌన్సెలింగ్ కోసం ఎదురుచూస్తున్నారు. ఆంధ్ర యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కాలేజీలో ఉన్న 605 సీట్లు అయిపోయాయి. సీట్లు అలాట్ అయినా ఆయా కాలేజీల్లో ఐదు నుంచి పది మంది వరకూ చేరలేదు. వారిలో జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ ర్యాంకర్లు ఉన్నారు.

ఇంజనీరింగ్ కాలేజీ సీట్లను రెండు కేటగిరీలుగా విభజించి భర్తీచేస్తారు. ఎంసెట్ ర్యాంకర్లతో ఏ కేటగిరీ సీట్లను భర్తీచేస్తారు. కాలేజీకి కేటాయించిన సీట్లలో 70 శాతం సీట్లు ఏ కేటగిరీలో ఉంటాయి. మిగిలిన 30 శాతం సీట్లను 'బి' కేటగిరీ కింద పరిగణిస్తారు.

ఇదిలావుంటే కొందరు కోర్టును ఆశ్రయించడంతో రెండో విడత కౌన్సెలింగ్ వాయిదా పడింది. అయితే, మేనేజ్‌మెంట్ కోటా సీట్లను ఇప్పటికే చాలావరకు

... మిగతా 6వ పేజీలో

విశాఖ వాసులకు దక్కని శ్రీవాణి టికెట్లు

తిరుపతి విమానాశ్రయంలో ఉదయం 8 గంటలకు కౌంటర్ ఓపెన్

రోజుకు 200 టికెట్లు విక్రయం

» రూ.10 వేల డొనేషన్, రూ.500 టికెట్ ధర ఇస్తే శ్రీవారి బ్రేక్ దర్శనానికి టోకెన్
» 8.30 గంటలలోపు హైదరాబాద్ నుంచే ఐదు విమానాలు
» 3 గంటలకు ల్యాండ్ అవుతున్న విశాఖ విమానం
» సమయం మార్చాలని ఏపీ విమాన ప్రయాణికుల సంఘం డిమాండ్



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనానికి ఉన్న డిమాండ్ అంతా ఇంతా కాదు. పది వేల రూపాయలు డొనేషన్‌గా ఇస్తే 'శ్రీవాణి' పేరుతో టికెట్ ఇస్తారు. దాంతో వీఐపీ బ్రేక్ దర్శనం చేసుకోవచ్చు. చాలా తక్కువ సమయంలో స్వామిని అతి దగ్గర నుంచి చూసే భాగ్యం కలుగుతుంది.

తిరుమల తిరుపతి దేవస్థానం ఇటీవల తిరుపతి విమానాశ్రయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటుచేసి శ్రీవాణి టికెట్లను విక్రయిస్తోంది. రోజుకు 200 మాత్రమే ఇస్తుంది. ఉదయం 8 గంటలకు కౌంటర్ తెరుస్తున్నారు. టికెట్ కావలసిన వారు ఏ విమానంలో వచ్చారో దానికి సంబంధించిన బోర్డింగ్ పాస్‌తో పాటు గుర్తింపు కార్డు ఏదైనా సమర్పిస్తే వెంటనే రూ.10 వేలు డొనేషన్, రూ.500 టికెట్ ధర తీసుకొని టోకెన్ ఇస్తున్నారు. ఆ టికెట్‌తోనే కొండపై వసతి సదుపాయం కూడా కల్పిస్తారు. అయితే ఈ టికెట్లు ఉదయం తొమ్మిది గంటలకే అయిపోతున్నాయి. ఆ తరువాత విమానాల్లో తిరుపతి చేరుకున్న వారికి శ్రీవాణి టికెట్లు దొరకడం లేదు. తిరుపతి విమానాశ్రయానికి ఉదయం 8.30 గంటలలోపు ఒక్క హైదరాబాద్ నుంచే ఐదు విమానాలు వస్తున్నాయి. ఆ తరువాత ఢిల్లీ నుంచి ఒకటి, ముంబై నుంచి మరొకటి పది గంటలలోపు వస్తున్నాయి. తిరుపతికి విమానంలో వచ్చారంటే స్వామి దర్శనం కోసమేనని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఒక్కో విమానంలో వంద మంది చొప్పున లెక్క వేసుకుంటే 8.30 గంటల్లోపు హైదరాబాద్ నుంచే 500 మంది వస్తున్నారు. ఆ 200 టికెట్లు వారికే సరిపోవడం లేదు. ఆ తరువాత దిగిన వారికి టికెట్లు ఉండడం లేదు. విశాఖ నుంచి మధ్యాహ్నం బయలుదేరే విమానం తిరుపతిలో మూడు గంటలకు ల్యాండ్ అవుతోంది. అప్పటికే కౌంటర్ మూసేస్తున్నారు. దాంతో శ్రీవాణి టికెట్లు దొరకడం లేదు. అందుకని విశాఖ నుంచి తిరుపతి విమానం ప్రయాణ వేళలు మార్చాలని ఏపీ విమాన ప్రయాణికుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే...విశాఖ ప్రయాణికులకు కొన్ని టికెట్లు కేటాయించి, వాటిని ఇక్కడి విమానాశ్రయంలోనే విక్రయించే ఏర్పాటుచేయాలని సూచిస్తున్నారు. ఎవరు ముందు వస్తే వారికే అని కాకుండా ప్రతి విమానానికి ఇన్ని టికెట్లు అన్ని కేటాయిస్తే బాగుంటుందని చెబుతున్నారు. ఇంకా అవకాశం ఉంటే దేశంలోని ప్రతి విమానాశ్రయానికి కొన్ని శ్రీవాణి టికెట్లు కేటాయించి, వాటిని స్థానికంగానే అందించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

ఒడిశా నుంచి ఫిషింగ్ బోట్ ఇంజన్ల అక్రమ రవాణా

బిల్లులు లేవని స్వాధీనం చేసుకున్న వాణిజ్య పన్నుల శాఖ



వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం ఆవరణలో సీజ్ చేసిన వాహనం. (ఇన్‌సెట్‌లో) వాహనంలో బోట్ల ఇంజన్‌లు

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఒడిశాలో మత్స్యకారులకు అక్కడి ప్రభుత్వం రాయితీ ధరపై అందిస్తున్న బోటు ఇంజన్లను కొందరు అక్రమంగా శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలకు తీసుకువచ్చి అమ్ముకుంటున్నారు. ఇది చాలా కాలంగా జరుగుతోంది. దీనిపై ఒడిశాలో పలు కేసులు నమోదయ్యాయి. తాజాగా రెండు వాహనాలు బోటు ఇంజన్లతో ఆంధ్రప్రదేశ్‌లోకి వచ్చాయని విశ్వసనీయ సమాచారం అందడంతో వాణిజ్య పన్నుల శాఖ (జీఎస్టీ) అధికారులు కాపు కాచి తనిఖీలు చేయగా రెండు రోజుల క్రితం ఒకటి పట్టుబడింది. అందులో మూడు బోటు ఇంజన్లు ఉండగా, వాటిలో రెండింటికి బిల్లులు లేవు. దాంతో ఆ వాహనాన్ని అధికారులు స్వాధీనం చేసుకొని ఆరిలోవలోని వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయానికి తరలించారు. మరో వాహనం శ్రీకాకుళం జిల్లాలో ఇంజన్లను డెలివరీ చేసినట్టు తెలిసింది. గ్రీవ్స్ కంపెనీ ఈ ఇంజన్లను సరఫరా చేస్తున్నట్టు తెలిసింది. ఒడిశాలో మత్స్యకారుల వద్ద దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి, వాటిని ఏపీకి తీసుకువచ్చి ఎక్కువ ధరకు అమ్ముతున్నట్టు

... మిగతా 6వ పేజీలో

మానవ తప్పిదమే

లుపిన్‌లో ప్రమాదంపై అధికారులు

» గత నెల 8న కూడా విషవాయువు లీక్
» నెల తిరగకుండానే మళ్లీ అదే తరహా ప్రమాదం
» సిబ్బందికి అవగాహన కల్పించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం
» 'లెటర్ మొబిర్' అనే మందు తయారుచేసిన తరువాత వ్యర్థాలను ఫిల్టర్ చేస్తుండగా గుర్తు తెలియని విషవాయువులు వెలువడినట్టు నిర్ధారణ?

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాంకీ ఫార్మా సిటీలోని లుపిన్ కంపెనీలో సోమవారం ఉదయం జరిగిన ప్రమాదానికి (విషవాయువు లీకేజీ) కారణం మానవ తప్పిదమేనని అధికారులు అంగీకరిస్తున్నారు. సంస్థలో అత్యాధునిక యంత్ర పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం ఉన్నప్పటికీ వాటిని ఆపరేట్ చేసే సిబ్బందికి సరైన అవగాహన కల్పించడంలో యాజమాన్యం విఫలమైంది.



లుపిన్ కంపెనీ

లుపిన్‌లో గత నెల అంటే జూలై 8వ తేదీన ఇలాగే విషవాయువు లీకైంది. అప్పుడు ఒకరు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. ఆ విషయం రెండు రోజుల వరకూ బయటకు చెప్పలేదు. తాజా ఘటనలోను అలాగే చేశారు. సోమవారం ఉదయం మూడుగంటల సమయంలో ప్రమాదం జరిగితే 11 గంటల తరువాత అధికారులకు సమాచారం ఇచ్చారు. ఏ రకమైన విషవాయువు వెలువడిందో

... మిగతా 6వ పేజీలో

9న పాడేరుకు ముఖ్యమంత్రి?

» ఆదివాసీ దినోత్సవానికి హాజరుకానున్నచంద్రబాబు



పాడేరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పాడేరులో ఈనెల తొమ్మిదిన నిర్వహించే అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవానికి ముఖ్యఅతిథిగా సీఎం చంద్రబాబునాయుడు హాజరయ్యే అవకాశం ఉందని తెలిసింది. ఈ మేరకు సీఎంవో నుంచి జిల్లా అధికారులకు సమాచారం అందింది. సభా వేదిక, ఇతర ఏర్పాట్లపై కసరత్తు ప్రారంభించారు. పాడేరు సమీపంలో కార్యక్రమాన్ని నిర్వహించాలని భావిస్తున్నారు. సీఎం పర్యటన సమన్వయకర్త పెందుర్తి వెంకటేశ్ బుధవారం సభా వేదిక, తదితరాలపై అధికారులకు సూచనలు చేస్తారని, అనంతరం సీఎం పర్యటనపై ఒక స్పష్టత వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

సంగివలస రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాన్ని తొలగించిన దృశ్యం

తగరపువలస, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : రహదారి మధ్యలో విద్యుత్తు స్తంభం తొలగించని కారణంగా సంగివలస రహదారి పనులు ప్రారంభం కాలేదని సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'నిధులున్నా ప్రారంభం కాని సంగివలస రహదారి' శీర్షికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం రహదారి మధ్యలో ఉన్న స్తంభాన్ని తొలగించి దూరంగా ఏర్పాటు చేశారు. దీంతో రహదారి పనులు ప్రారంభించడానికి అవకాశం ఏర్పడింది. అయితే ఈ రహదారికి ఇరువైపులా అనేక ఆక్రమణలు ఉన్నాయి వీటిని కూడా తొలగిస్తే తప్ప 80 అడుగుల మేర రహదారిని వెడల్పు చేయడానికి అవకాశం ఉండదని స్థానికులు అంటున్నారు.ఈ విషయంలో కూడా అధికారులు శ్రద్ధ పెట్టాలని ఈ ప్రాంతానికి చెందిన చోడిపల్లి సాయి జయశంకర్ అధికారులను కోరారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే సంగివలస నుంచి పాండ్రంగి గ్రామానికి నేరుగా వాహనాలు రాకపోకలు సాగించడానికి అవకాశం కలుగుతుందని అన్నారు. 80 అడుగుల మేర విస్తరించి నిర్మించడానికి అధికారులు ప్రయత్నాలు చేయాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

స్మార్టు మీటర్లు వద్దేవద్దు : సీపీఐ



ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు, కార్యకర్తలు

తగరపువలస, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లగా కొత్తగా ఏర్పాటు చేయనున్న విద్యుత్తు స్మార్టు మీటర్లను తక్షణం ఉపసంహరించాలని కోరుతూ మంగళవారం చిట్టివలస విద్యుత్తు సబ్ స్టేషన్ ఎదుట సీపీఐ కార్యకర్తలు ధర్నా చేశారు. ఈ ధర్నాకు సీపీఐ కార్యదర్శి కానూరి రాంబాబు అధ్యక్షత వహించారు. ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ విద్యుత్తు బిల్లులపై బాదుడే బాదుడు అని ప్రచారం చేసి ఇప్పుడు మళ్లీ అవే మీటర్లను ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. విద్యుత్తు చార్జీలు పెరగిపోయి వినియోగదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని. ఈ స్మార్టుమీటర్ల వల్ల మరింత ఇబ్బంది ఎదురవుతుందన్నారు. సీపీఐ సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న విద్యుత్తు మీటర్లనే కొనసాగించాలన్నారు. అనంతరం విద్యుత్తు సహాయ ఇంజనీర్ బి.రవికి సీపీఐ కార్యకర్తలు సమస్యలతో వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో మావూరి వీర్రాజు, సన్నిబాబు, లక్ష్మణరావు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

మెట్లమార్గం పునరుద్ధరణకు సన్నాహాలు

- చందనోత్సవం రోజు గోడ కూలిన దుర్ఘటనతో మూసివేసిన రహదారి
- రానున్న విజయదశమి నాటికి తెరిచేందుకు చర్యలు
- సాధ్యసాధ్యాలను పరిశీలించిన ఆలయ అధికారులు


గోడకూలిన ప్రాంతంలో పరిశీలిస్తున్న ఈవో త్రినాథరావు, ఈఈ వెంకటరమణ

సింహాచలం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి నిజరూప దర్శనం చందనోత్సవం అనగా ఈ ఏడాది ఏప్రిల్ 30న జరిగిన దుర్ఘటనతోసింహగిరిపై వ్యాపారా సముదాయం మధ్య నుంచి జోడుభద్రాల వరకు ఉన్న మధ్య మెట్ల మార్గాన్ని మూసివేశారు. రానున్న విజయదశమి పర్వదినాన సింహగిరి నుంచి కొండ దిగువకు శమీ పూజోత్సవానికి సింహాద్రినాథుడు పల్లకిలో కాలినడకన వెళ్లే సంప్రదాయాన్ని దృష్టిలో ఉంచుకుని మూసిన మెట్లమార్గాన్ని మరమ్మత్తులు పూర్తి చేసి తెరిపించాలిని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామ్‌నారాయణరెడ్డిని అప్పన్న ఆలయ వైదిక వర్గాలు కోరారు. దాంతో మంత్రి స్పందిస్తూ తక్షణం మెట్లమార్గం తెరచేందుకు గల అవకాశాలను పరిశీలించి తగు చర్యలు చేపట్టాని ఈవోను ఆదేశించారు. అంతేకాకుండా గతంలో మాదిరిగానే మెట్లమార్గాన్ని జోడుభద్రాల మధ్య నుంచి నేరుగా పశ్చిమ మాడవీధికి కనెక్టు చేయాలని, అదే సంప్రదాయమంటూ వైదికులు ఈవోకు లిఖితపూర్వంగా సమాచారం ఇచ్చినట్టు తెలిసింది.దాంతో కూలిన గోడప్రాంతంలో మెట్లను ఏ విధంగా నిర్మించాలనే దానిపై పర్యాటక శాఖ అధికారులతో దేవస్థానం అధికారులు చర్చలు ప్రారంభించారు.

ఈ ప్రక్రియలో భాగంగానే సింహాచల ఈవో వేంద్ర త్రినాథరావు, ఈఈ సీహెచ్ వెంకటరమణ తదితరులతో కలిసి కూలిన గోడ ప్రాంతాన్ని ఈనెల 2న పరిశీలించారు.

అలాగే టూరిజం ప్రసాద్ పథకం కన్సల్టెంట్ సారథ్యంలో కూడా కొందరు అధికారులు మెట్లమార్గాన్ని రెండు రోజుల క్రితం పరిశీలించారు. ఏదిఏమైనా విజయదశమి పర్వదినానికి ముందుగానే శాశ్వత ప్రాతిపదికన మెట్లమార్గాన్ని పునరుద్ధరించి అటు భగవంతుని, భక్తుల రాకపోకలకు అనుకూలంగా తీర్చిదిద్దేందుకు అధికారులు పూర్తి స్థాయిలో సన్నాహాలు ప్రారంభించారు.

జనసేన ఇన్‌చార్జి నాగసందీప్‌కు సన్మానం


నగరపాలెంలో నాగసందీప్‌ను సన్మానిస్తున్న జనసేన నాయకులు

భీమునిపట్నం (రూరల్) ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి డైరెక్టర్‌గా నియమితులైన భీమిలి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పంచకర్ల నాగ సందీప్‌ను మంగళవారం భీమిలి రూరల్ మండలం నగరపాలెంలో జనసేన కార్యకర్తలు సన్మానించారు. ఈ కార్యక్రమానికి మండల జనసేన కార్యదర్శి పొట్నూరు కొండబాబు అధ్యక్షత వహించారు. గ్రామ పంచాయతీ జనసేన అధ్యక్షుడు ఇద్దిపల్లి నానాజీ, ఉపాధ్యక్షుడు పల్లా రమణ తమ్మిన ఎల్లారావు, నేతలు దువ్వు పైడిరాజు, పల్ల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. శాలువా కప్పి సన్మానించి పూలమాలలు అందించారు.ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను కార్యకర్తలు ఎప్పటికప్పుడు తెలియజేయాలని కోరారు. సేవా కార్యక్రమాల్లో జనసేన కార్యకర్తలు చురుగ్గా పాల్గొనాలని కోరారు.

అప్పన్న మహిమ ప్రచారమే ధ్యేయం

- సింహాద్రిమఠం సభ్యులు


గిరిజనులకు స్వామివారి చిత్రపటాలు అందిస్తున్న దృశ్యం

సింహాచలం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రహ్లాదుని రక్షణార్థం సింహగిరిపై కొలువుదీరిన వరాహలక్ష్మీనృసింహుని అవతార రహస్యం, సింహాచల క్షేత్ర మహత్యం ప్రచారమే ప్రధాన లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు సింహాచల ప్రాంతానికి చెందిన సింహాద్రిమఠం వ్యవస్థాపకుడు కసిరెడ్డి సురేంద్ర బాబు తెలిపారు. తద్వారా మన్యం ప్రాంతాల్లోని అమాయక గిరిజనులను మత మార్పిడుల నుంచి రక్షించడం మరొక అంతర్లీన ఉద్దేశమన్నారు. దానిలో భాగంగా కొందరు దాతల సహకారంతో మంగళవారం ఒడిశా రాష్ట్ర కోరాపుట్ జిల్లా గులుపొండి, అల్లూరిజిల్లా డుంబ్రిగుడ, అరకు, తదితర గ్రామాల్లో పర్యటించి నిరుపేద గిరిజనులకు దుప్పట్లు, తువాళ్లు, సింహాద్రి అప్పన్న పటాలను అందజేసి వారికి ప్రార్థన విధానాన్ని అవగాహన కల్పించనట్టు సురేంద్ర చెప్పారు. ఈ కార్యక్రమంలో మఠం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కూటమి నేతలను నిలదీయండి

- వైసీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు

ఆనందపురం ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయని కూటమి నాయకులకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని వైసీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అన్నారు. మండలంలోని తర్లువాడలో వైసీపీ మండల అధ్యక్షుడు బంక సత్యనారాయణ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ హామీలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ప్రతిపక్ష నాయకులపై రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. నిరుద్యోగ యువత, ఆడ బిడ్డలకు మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ప్రజల్లో అవగాహన పెంచే ఉద్దేశంతో కరపత్రాలు పంపిణీ చేస్తూ వైసీపీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి నిజాలు తెలియజేస్తున్నారని అన్నారు. సంపద సృష్టి పేరుతో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో నెట్టేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శారదాప్రియాంక, జడ్పీటీసీ కోరాడ వెంకటరావు, మండల బీసీ సంఘం అధ్యక్షుడు కోరాడ ఆదినారాయణ, మండల వైసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, నాయకులు బంక సత్యం, గండ్రెడ్డి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, లెంక రాంబాబు, బంక శ్రీను, చందక సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా నుంచి ఫిషింగ్ బోట్ ఇంజన్ల అక్రమ రవాణా

... 5వ పేజీ తరువాయి

సమాచారం. విశాఖతో పాటు అనకాపల్లి జిల్లా నక్కపల్లి, అచ్యుతాపురం ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు వీటిని కొనుగోలు చేస్తుంటారని తెలిసింది. పెద్ద సంఖ్యలో ఈ ఇంజన్లు ఇక్కడికి రావడం వల్ల తమ వ్యాపారం తగ్గిపోయిందని గుర్తించిన వ్యాపారులే అక్రమ రవాణా సమాచారాన్ని వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు అందించినట్టు తెలిసింది.

జరిమానా వేసి విడిచిపెట్టాం

- శ్రీనివాసరావు, ఇంటెలిజెన్స్ అధికారి, వాణిజ్య పన్నుల శాఖ

బిల్లులు లేకుండా బోటు ఇంజన్లు వస్తున్నాయని సమాచారం రాగా తనిఖీలు నిర్వహించి ఒక వాహనాన్ని పట్టుకున్నాం. అందులో మూడు ఇంజన్లు ఉండగా, ఒక దానికే బిల్లు ఉంది. మిగిలిన రెండింటికి బిల్లులు లేవు. కార్యాలయానికి వాహనాన్ని తీసుకువచ్చాక, జరిమానా వేసి విడిచి పెట్టాం.

హాట్‌కేకుల్లా సీఎస్‌ఈ సీట్లు

... 5వ పేజీ తరువాయి

కాలేజీలు భర్తీ చేసుకున్నట్టు చెబుతున్నారు. అయితే, వీటిలెక్కలను అధికారులు వెల్లడించడం లేదు.

మేనేజ్‌మెంట్ సీటు హాట్ గురు..

జిల్లాలోని ప్రముఖ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు పోటీ నెలకొంది. మొదటి మూడు, నాలుగు స్థానాల్లో నిలిచే కాలేజీల్లో కంప్యూటర్ సైన్స్‌కు సంవత్సరానికి రూ.4 లక్షల నుంచి ఆరు లక్షల రూపాయల వరకూ తీసుకుంటున్నట్టు చెబుతున్నారు. ఒక ప్రముఖ కాలేజీలో అయితే రూ.ఏడు లక్షల వరకూ పలుకుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈసీఈ, ఐటీ వంటి బ్రాంచీలకు ఆ నాలుగు కాలేజీల్లో సంవత్సరానికి రూ.2.2 లక్షల నుంచి రూ.3 లక్షల వసూలు చేస్తున్నట్టు చెబుతున్నారు. రెండో కేటగిరీగా చెప్పుకునే కాలేజీల్లో కూడా కంప్యూటర్ సైన్స్‌కు ఏడాదికి రూ.1.7 లక్షల నుంచి నుంచి రూ.2 లక్షల వరకూ, మిగిలిన బ్రాంచీలకు రూ.లక్షన్నర వసూలు చేస్తున్నారు. ప్రముఖ కళాశాలల్లో కంప్యూటర్ సైన్స్, ఈసీఈ, ఐటీ వంటి కోర్సుల్లో సీట్లు అయిపోయాయి. రెండు, మూడు కేటగిరీలకు చెందిన కాలేజీల్లో మిగిలిన బ్రాంచీల్లో సీట్ల కోసం రూ.80 వేలు నుంచి లక్ష రూపాయలు వరకూ వసూలు చేస్తున్నారు. అయితే, ఆయా కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు కూడా ఆసక్తి చూపించకపోవడం గమనార్హం.

మానవ తప్పిదమే..

... 5వ పేజీ తరువాయి

గుర్తించాల్సిన కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు అసలు సమాచారమే ఇవ్వలేదు. మీడియా ద్వారా విషయం తెలుసుకున్న అధికారులు మధ్యాహ్నాం మూడు గంటలకు అక్కడకు బయలుదేరి వెళ్లారు. అంటే జరిగింది తప్పు అని, దానిని దాచిపెట్టాలని యాజమాన్యం యత్నించినట్టుస్పష్టంగా అర్థమైంది.

లెటర్ మొవిర్ తయారీలో లీకేజీ

లుపిన్ ఫార్మాలోని మల్టీ ప్రొడక్షన్ రెండో బ్లాకులో 'లెటర్ మొవిర్' మందు తయారుచేసిన తరువాత వ్యర్థాలను ఫిల్టర్ చేస్తున్నప్పుడు గుర్తు తెలియని విషవాయువులు వెలువడ్డాయి. అక్కడ తనిఖీకి వెళ్లిన షిఫ్ట్ ఇన్‌చార్జి సరైన మాస్క్ ధరించకపోవడం వల్ల ఆ వాయువు పీల్చి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే షీలానగర్‌లోని కిమ్స్‌కు తరలించారు. అయితే ఆ గది నుంచి విషవాయువులు వస్తున్నాయని ఎటువంటి హెచ్చరికలు చేయకపోవడం గమనార్హం. పక్క యూనిట్‌లో పనిచేస్తున్నవారు వెళ్లి అక్కడి వారిని రక్షించారు. అలా సాయపడిన వారికి ఇబ్బంది రావడంతో వారినీ ఆస్పత్రిలో చేర్చారు. మొత్తం ఆరుగురు కిమ్స్‌లో ఉన్నారు. బాధితులను చూడాలని యత్నిస్తే ఆస్పత్రి వర్గాలు అనుమతించకపోవడం గమనార్హం. ఆ సమయంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అక్కడికి రాగా బాధితులు ఆయన్ను చుట్టుముట్టారు. దాంతో ఘటన జరిగిన 18 గంటల తరువాత అంటే రాత్రి తొమ్మిది గంటల తరువాత కుటుంబ సభ్యులను ఆస్పత్రిలోకి అనుమతించారు. ఇవన్నీ చూస్తుంటే...ఏదో దాయాలని అన్ని వర్గాలు యత్నిస్తున్నాయనే విషయం స్పష్టమవుతోంది.

కఠిన చర్యలు తీసుకోవాలి

- మానవ హక్కుల వేదిక డిమాండ్

ఈ ఘటనపై మానవ హక్కుల వేదిక ఉమ్మడి విశాఖ ప్రధాన కార్యదర్శి కె.అనురాధ, సహాయ కార్యదర్శి జీడర్ రహమాన్‌లు స్పందించారు. కంపెనీలు ప్రమాద కారణాలను గోప్యంగా ఉంచడంపై చూపే శ్రద్ధ భద్రతపై పెట్టాలని సూచించారు. ఈ ప్రమాదానికి వ్యవస్థాపక కారణాలు అధికారికంగా వెల్లడించాలని, బాధితులకు ఉచిత వైద్యసేవలు, ఆర్థిక పరిహారం అందించాలని, యాజమాన్య ప్రతినిధులు, పరిశ్రమ భద్రతా అధికారులపై శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఫార్మా సిటీలో పబ్లిక్ అలర్ట్ వ్యవస్థ, ఆపత్కాల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కోరారు.

లెటర్‌మొవిర్ ఒక్కో మాత్ర రూ.2 వేలు

సైటోమెగలో వైరస్ (సీఎంవీ) ఇన్‌ఫెక్షన్ సోకిన వారికి, అవయవ మార్పిడి చేయించుకున్న రోగులకు లెటర్‌మొవిర్ మాత్రలు సిఫారసు చేస్తారు. ఈ మాత్ర ఒక్కొక్కటి రూ.2 వేలు. పది మాత్రల స్ట్రిప్ రూ.20 వేలకు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఈ మందు తయారీ సమయంలోనే విషవాయువు లీకైంది. అది ఏమిటన్నది ఇంకా గుర్తించలేదు. గత నెలలో వెలువడిన వాయువు ఏమిటో కూడా ఇప్పటివరకూ వెల్లడించలేదు. ఆ వాయువు ఆనవాళ్లు తెలుసుకోకూడదనే పీసీబీ అధికారులకు యాజమాన్యం తక్షణ సమాచారం ఇవ్వడం లేదు. వీటన్నింటిపై సమగ్ర విచారణ చేయాల్సి ఉంది.

యథా కార్పొరేటర్లు! తథా అధికారులు!!

... 5వ పేజీ తరువాయి

సమావేశాల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన తీర్మానాలను మినహాయిస్తే పాలనాపరంగా తీసుకున్న నిర్ణయాలు, చేసిన తీర్మానాలు అమలు జరిగిన దాఖలాలు కనిపించడం లేదు. గతంలో చేసిన తీర్మానాల అమలు గురించి కార్పొరేటర్లు పట్టించుకోకపోవడంతో అధికారులు కూడా వాటిని సీరియస్‌గా తీసుకోవడం మానేశారు.

సమావేశం కోసం రూ.లక్షలు ప్రజాధనం ఖర్చు

మూడు నెలలకు ఒకసారి కౌన్సిల్ తప్పనిసరిగా సమావేశం కావాల్సి ఉంటుంది. ఒకసారి కౌన్సిల్ సమావేశం జరిగితే 97 మంది కార్పొరేటర్లు, ఐదుగురు కో-ఆప్షన్ సభ్యులు, 14 మంది ఎక్స్ అఫీషియో సభ్యులతోపాటు అధికారులు, కార్పొరేటర్ల అనుచరులు పాల్గొంటారు. అందరికీ ఉదయం టీ, స్నాక్స్ మధ్యాహ్నాం భోజనం, సాయంత్రం మళ్లీ టీ, స్నాక్స్ అందుబాటులో ఉంచుతున్నారు. అలాగే సభ్యులకు కౌన్సిల్ హాల్‌లో మంచినీరు, శానిటైజర్ వంటివి అందజేసేందుకు ప్రత్యేకంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. వీటన్నింటి కోసం ఒక్కో సమావేశానికి రూ.లక్షల్లో ఖర్చుపెడుతున్నారు. అంత ప్రజాధనం వెచ్చించి నగరవాసుల ప్రయోజనాల కోసం నిర్ణయాలు తీసుకునేందుకు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాసరే ప్రయోజనం ఉండడం లేదనే వాదనే వినిపిస్తోంది. ముఖ్యంగా జీవీఎంసీకి ఆదాయం వచ్చే మార్గాలను దెబ్బకొడుతున్న వారిపై చర్యలకు వెనుకాడుతున్నారు. అవినీతి అంశాలపై చర్యలకు సిద్ధపడినట్టు తీర్మానాలు చేసినా, వాటిని అమలు చేసేవిషయంలో మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కౌన్సిల్‌లో వన్‌టౌన్ హోల్‌సేల్ ఫ్రూట్‌మార్కెట్, జ్ఞానాపురంలోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో దుకాణాల అద్దెల్లో పెద్దఎత్తున గోల్‌మాల్ జరుగుతోందని అప్పటి ప్రతిపక్ష సభ్యులు ఆరోపించారు. దానిపై స్పందించిన అప్పటి మేయర్ గొలగాని హరివెంకటకుమారి ఆయా మార్కెట్లలో దుకాణాల అద్దెలను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలుజారీచేశారు. ఏమైందో తెలియదుగానీ అన్ని పార్టీల కార్పొరేటర్లతో అఖిలపక్ష కమిటీని నియమించి అక్కడితో వదిలేశారు. ఇప్పటికీ దుకాణాల అద్దెలు మాత్రం పెంచలేదు. అలాగే పాతజైలురోడ్డులో అనధికారికంగా నడుస్తున్న ఫుడ్‌కోర్ట్‌ను తక్షణం తొలగించాలంటూ ఏడాది కిందట అప్పటి మేయర్ గొలగాని హరివెంకటకుమారి తీర్మానం చేశారు. ఇప్పటికీ ఫుడ్‌కోర్ట్ నిరాటంకంగా కొనసాగుతోంది. ఈ ఏడాది జూన్‌లో జరిగిన కౌన్సిల్ సమావేశంలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టుపై చర్చ జరిగినప్పుడు, ఆ ప్రాజెక్టు గడువు ముగిసినందున ఇకపై పొడిగించవద్దని అధికారులను మేయర్ పీలా శ్రీనివాసరావు ఆదేశించారు. కానీ నగరంలో మూడుచోట్ల కొత్తగా నిర్మించబోయే వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లను స్మార్ట్ సిటీ ఆధ్వర్యంలోనే చేపట్టేలా అధికారులు కసరత్తు ప్రారంభించడం విశేషం. ఇప్పటికైనా కొత్త మేయర్ పీలా శ్రీనివాసరావు కౌన్సిల్ తీర్మానాలు అమలు జరిగేలా చర్యలు తీసుకోవడం ద్వారా కౌన్సిల్ ఔన్నత్యాన్ని కాపాడాలని కార్పొరేటర్లు కోరుతున్నారు.

భవన నిర్మాణాలపై అవగాహన తప్పనిసరి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్


సమావేశంలో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

కొమ్మాది, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తీసుకున్న ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు చేపట్టేలా కాంట్రాక్టర్లకు అవగాహన కల్పించాలని ప్లానింగ్ అధికారులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సూచించారు. జీవీఎంసీ జోన్-2 కార్యాలయంలో జడ్సీ కనకమహాలక్ష్మితో సమీక్ష మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ భూమిని కబ్జాలకు గురికాకుండా కాపాడాల్సిన బాధ్యత తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతిరోజు ప్లానింగ్ అధికారులు సచివాలయం పరిధిలో పర్యటిస్తూ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలన్నారు. నూతన భవన నిర్మాణాలు చేపట్టినప్పుడు వాటికి గ్రీన్‌మ్యాట్ ఏర్పాటు చేయించాలని, భవన నిర్మాణ సామగ్రిని రోడ్డుపై వేయకుండా చూడాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. పారిశుధ్య కార్మికులకు పుష్ కార్డుల పంపిణీ గురించి ఆరా తీశారు. కోళ్ల వ్యర్థాలు తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకర్ పెట్టాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అవగాహన కల్పించాలన్నారు. శతశాతం పన్నులు వసూలు అయ్యేవిధంగా పనిచేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అప్పన్నకు స్వర్ణ తులసీ దళార్చన


స్వర్ణ తులసీ దళాలతో అర్చన చేస్తున్న అర్చకులు

సింహాచలం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్న స్వామికి మంగళవారం వైభవంగా స్వర్ణ తులసీ దళార్చన చేశారు. శ్రావణ ఏకాదశిని పురస్కరించుకుని వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపసేవ, సేవాకాలం వంటి ప్రభాతారాధనలను యథావిధిగా జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి, భక్తుల గోత్రనామాలతో సంకల్పించి స్వామివారికి స్వర్ణ తులసీ దళాలతో అర్చన గావించారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఇదే వేదికపై సింహాచలేశుని నిత్య కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

అప్పన్న ఆలయంలో ఏకాదశి తిరువీధి

సింహాచలం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఏకాదశి తిరువీధి వైభవంగా నిర్వహించారు. దానిలో భాగంగా మంగళవారం రాత్రి ఆరాధన సమయంలో ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని పల్లకిలో ఉంచారు. ఈ సందర్భంగా అర్చకులు తిరువీధి నిర్వహించారు. మార్గంలో అష్టదిక్పాలకులకు పూజలు చేసి నీరాజనాలిచ్చారు. అనంతరం భక్తులకు గోత్రనామాలతో పూజలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహించాలి

- జిమ్సర్ ప్రో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గీతాంజలి



తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గీతాంజలి, తదితరులు

ఎండాడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి తల్లిపాలు అత్యంత ఉపయోగకరమని, అందువల్ల అందరూ తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహించాలని గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) ప్రో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి.గీతాంజలి అన్నారు. తల్లిపాల వారోత్సవాలను గీతం ఆస్పత్రి ప్రాంగణంలో మంగళవారం మహిళా సాధికారిక విభాగం, ఆస్పత్రి గైనాకాలజీ, పీడియాట్రిక్స్ విభాగాల ఆధ్వర్యంలో ప్రారంభించారు. జిమ్సర్ డీన్ డాక్టర్ ఎస్పీ రావు మాట్లాడుతూ జాతీయ కుటుంబ ఆరోగ్య నివేదిక ప్రకారం విశాఖలో 68 శాతం మంది తల్లులు మాత్రమే బిడ్డ పుట్టిన తర్వాత ఆరు నెలల పాటు తల్లిపాలు అందిస్తున్నారన్నారు. తల్లిపాలే బిడ్డలకు మంచి పోషకాహారన్నారు. అనంతరం పలు వురు గర్భిణులకు పోషకాహారాన్ని అందించారు. కార్యక్రమంలో మహిళా సాధికారిక విభాగం చైర్‌పర్సన్ డాక్టర్ వి.బోధిశ్రీవిద్య, సామాజిక వైద్య విభాగం నిపుణులు డాక్టర్ షరోన్, చిన్నపిల్లల వైద్యురాలు డాక్టర్ లలిత, గైనకాలజీ విభాగం డాక్టర్ ఇందిర, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మురళీమోహన్, ఐసీడీఎస్ అధికారిణి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

భక్తుల సంతృప్తే లక్ష్యంగా అన్నప్రసాదం

- దేవస్థానం ఈవో వేంద్ర త్రినాథరావు


భక్తులకు వడ్డిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి భక్తుల సంతృప్తే లక్ష్యంగా అన్నప్రసాదాన్ని అందించాలని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వేంద్ర త్రినాథరావు అన్నారు. అన్నప్రసాదం తయారీ, వడ్డన తదితర అంశాలను మంగళవారం ఆయన పరిశీలన చేశారు. భోజన రుచి, నాణ్యత గురించి పలువురు భక్తులను అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానికి వచ్చిన భక్తులం దరూ సంతృప్తిగా తిని వెళ్లడమే ధ్యేయంగా సిబ్బంది కృషి చేయాలని అన్నారు. వంటల్లో ఎక్కడా రాజీ పడవద్దన్నారు.

కండక్టర్ రాలేదని నిలిచిన '541' సర్వీస్

పద్మనాభం, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): పద్మనాభం-మద్దిలపాలెం తిరిగే 541 సిటీ బస్సు ప్రతిరోజు మద్దిలపాలెం బస్సు డిపో నుంచి మధ్యాహ్నాం 3:20 గంటలకు బయలుదేరాలి కానీ సాయంత్రం 5 దాటినా రాకపోవడంతో సుమారు 30 మంది ప్రయాణికులు ఇబ్బం దులు పడ్డారు. దీంతో డిపో అధికారిని బస్సు గురించి అడిగితే కండక్టర్ రాలేదని సమాధానం చెప్పారు. రోజూ తిరిగే బస్సును కండక్టర్ రాలేదని ఎలా నిలిపివేస్తారని ప్రయాణికులు ప్రశ్నిం చారు. ఇకనైన బస్సును సకాలంలో నడపాలని ప్రయాణికులు అధికారులను కోరారు.

ఐదు కిలోమీటర్ల పరిధి ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలు ఉచితం

మధురవాడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా ప్రవేశాలు పొందాలంటే విద్యార్థులు తమ ఇళ్లనుంచి 5 కిలోమీటర్ల దూరంలోనే ఉండాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2025 - 26 విద్యాసంత్సరానికి ఇచ్చిన నోటిఫికేషన్‌లో 1 నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రైవేటు పాఠశాలల్లోనే ఉచిత ప్రవేశాలు పొందాలని ప్రభుత్వం పేర్కొన్నది. ఆ మేరకు అడ్మిషన్లు పూర్తయ్యాయి. ఇటీవలే జారీ చేసిన ఉత్తర్వుల్లో 3 - 5 కిలోమీటర్లు దూరం వరకు ఉన్న పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు పొందవచ్చని ప్రభుత్వం పేర్కొన్నది. దీంతో కొత్తగా మళ్లీ ఎస్‌ఎస్‌ఏ నోటిఫికేషన్ విడుదల చేసి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించాలి. ఉచిత ప్రవేశాలు పొందిన విద్యార్థుల తల్లులు ఇప్పటికే తల్లికి వందనం పొందితే, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వారే పాఠశాలలకు ఫీజులు చెల్లిస్తామని సమ్మతిపత్రం అందజేయాల్సి ఉంటుంది.

గ్రేటర్‌లో రాజకీయ సందడి

... 5వ పేజీ తరువాయి

బహిష్కరిస్తున్నట్టు సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు ప్రకటించారు. కౌన్సిల్‌లో గతంలో అధికారంలో ఉన్న వైసీపీపాలన మాదిరిగానే ప్రస్తుత కూటమి పాలన అవినీతిమయంగా మారిందని ఆయన ఆరోపించారు. మేయర్ ఉప ఎన్నిక సందర్భంగా కార్పొరేటర్లను సంతలో సరుకులు కొన్నట్టు కొనుగోలు చేశారన్నారు. సీపీఎం మొదటి నుంచి అవినీతి రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తోందన్నారు. పార్టీ జిల్లా నాయకత్వం ఆదేశాలకు అనుగుణంగా బుధవారం జరిగే స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఓటింగ్‌కు గైర్హాజరవుతున్నట్టు స్పష్టంచేశారు.

నగరం నిప్పుల కొలిమి

... 5వ పేజీ తరువాయి

కానరావడం లేదు. మంగళవారం గాలులు వేగం మందగించడంతో వేడి మరింత పెరిగి నగరం నిప్పుల కొలిమిలా మారింది. వాతావరణ శాఖ అధికారులకు కూడా ఈ వాతావరణం అంతుచిక్కడం లేదు. ప్రతిరోజు నగరంలో చెదురుమదురు వర్షాలు కురుస్తాయని ఇస్తున్న బులెటిన్లు తప్పు అవుతున్నాయి. మరికొన్నాళ్లు ఈ వేడి భరించాల్సి వచ్చేలా ఉంది.

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా

... 5వ పేజీ తరువాయి

సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విశాఖ పోర్టు నుంచి విదేశాలకు ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉన్న పీడీఎస్ బియ్యాన్ని ఇటీవల పట్టుకున్న విషయాన్ని గుర్తుచేశారు. పోర్టు నుంచి పీడీఎస్ బియ్యం రవాణాను నిలిపివేయాలన్నారు. ఇందుకు నిఘా ముమ్మరం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, పోర్టు, కస్టమ్స్ కలిసి సంయుక్తంగా తనిఖీలు చేయాలన్నారు. దీనికి పోర్టు కార్యదర్శి వేణుగోపాల్ మాట్లాడుతూ పోర్టు నుంచి అన్ని రకాల సహకారం అందిస్తామని, రేషన్ బియ్యం స్టోరేజీకి అనుమతి ఇవ్వొద్దని ఫ్రైట్ స్టేషన్లకు సూచనలు చేస్తామన్నారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్‌గౌర్, జేసీ మయూర్ అశోక్ పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ తాత్కాలిక రద్దు

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని కొత్తవలస, పెందుర్తి సెక్షన్‌లో ఆధునికీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 6 నుంచి 8 వరకు విశాఖ-బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్‌ను (18526), తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్-విశాఖ ఎక్స్‌ప్రెస్‌ను (18525) ఈ నెల 7 నుంచి 9 వరకు తాత్కాలికంగా రద్దు చేసినట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

30 మందికి సదరం ధ్రువపత్రాలు జారీ

ఆరిలోవ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : హనుమంతవాక జంక్షన్ సమీపంలో గల విమ్స్ ఆస్పత్రిలో దివ్యాంగులకు ధ్రువపత్రాలు జారీ చేసేందుకు ఏర్పాటు చేసిన సదరం కేంద్రంలో మంగళవారం సుమారు 30 మందికి తనిఖీలు నిర్వహించి ధ్రువపత్రాలు జారీ చేసినట్టు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు.

కాలువలో పూడిక తొలగింపు



పూడిక తొలగిస్తున్న దృశ్యం

ఆరిలోవ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10వ వార్డులో గల పాత డెయిరీ ఫారానికి సమీపంలో గల రాజీవ్‌నగర్‌లో గల ప్రధాన కాలువలో పేరుకు పోయిన పూడికను మంగళవారం జీవీఎంసీ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తొలగించారు. ఇందిరా నగర్ నుంచి రాజీవ్ నగర్ వరకు గల ప్రధాన కాలువల్లో పేరుకు పోయిన పూడికలను ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకునే వారేరీ!

» యథేచ్ఛగా నిర్మాణాలు సాగుతున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు, సచివాలయాల సిబ్బంది మౌనం


మద్దిలపాలెం గ్రేస్ చర్చ్ వెనుక సందులో నిర్మించిన భవనం


కేఆర్ఎం కాలనీ శివాలయం వీధిలో నిర్మిస్తున్న అదనపు అంతస్థు

మద్దిలపాలెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 23వ వార్డులో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా పరిమితి మించి భవన నిర్మాణాలు చేపడుతున్నారు. బైక్‌కు కూడా వెళ్లలేని సందుల్లో అయిదు అంతస్తుల మేడలు కడుతున్నారు. ఇష్టారాజ్యంగా నిర్మాణాలు వెలుస్తున్నా సచివాలయ, జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఏమీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

మద్దిలపాలెం గ్రేస్ చర్చి వెనుక సందులో ఓ నిర్మాణదారుడు నిబంధనలకు విరుద్ధంగా భారీ భవన నిర్మాణం చేపడుతున్నారు. జీ ప్లస్-2 అనుమతులు తీసుకుని జీ ప్లస్-4 నిర్మాణం చేస్తున్నారు. జీవీఎంసీ నిబంధనల మేరకు రోడ్డు ఫేసింగ్ వైపు ఆరున్నర అడుగులు, మిగతా మూడు వైపులా అయిదు అడుగుల స్థలం సెట్‌బ్యాక్స్‌కింద విడిచిపెట్టాలి. సదరు నిర్మాణదారుడు స్థలం నాలుగు వైపులా కనీసం అడుగు స్థలం కూడా సెట్‌బ్యాక్‌లు విడిచిపెట్టలేదు. నిబంధనలు పట్టించుకోకుండా అడ్డగోలుగా భవనం కడుతున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఈ భవనానికి వెళ్లేందుకు రెండు అడుగుల వెడల్పు రహదారి కూడా లేకపోవడం గమనార్హం. అయినప్పటికీ దర్జాగా అయిదంతస్తుల భవనం నిర్మాణం చేస్తున్నారు. కేఆర్ఎం కాలనీ శివాలయం వీధి రోడ్డులో మరో నిర్మాణదారుడు జీ ప్లస్-2 అనుమతులు పొంది జీ ప్లస్-3 భవనం నిర్మాణం చేస్తున్నారు. ఎటువంటి సెట్‌బ్యాక్స్ విడిచిపెట్టకుండా నిర్మాణం చేస్తున్నా అధికారులకు కనిపించకపోవడం ఏమిటో అర్థం కావడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమీపంలోనే సచివాలయాలు, టౌన్‌ప్లానింగ్ కార్యదర్శులు ఉన్నా అక్రమ నిర్మాణాలను మాత్రం పట్టించుకోవడం లేదు. కేవలం నోటీసులు జారీ చేసి గమ్మున ఉంటున్నారు. అంతకుమించి ఎలాంటి చర్యలకు ఉపక్రమించకపోవడంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భవన నిర్మాణాల సమయంలో ఇబ్బందులు పడుతున్నా, స్థానికులు ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదని వాపోతున్నారు. అదనపు అంతస్థు నిర్మాణానికి రూ.లక్షల్లో ముడుపులు చెల్లిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ముపై, నలభై గజాల్లో నిర్మాణాలు చేసుకునే పేదవారిని ముప్పుతిప్పలు పెట్టే సచివాలయ కార్యదర్శులు పెద్ద భవనాలపై కన్నెత్తి చూడడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

సచివాలయ సిబ్బంది నుంచి జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల వరకు ముడుపులు తీసుకుంటూ అక్రమ నిర్మాణాలకు అండగా ఉంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అక్రమ భవనాల నిర్మాణాలపై టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మధుసూదనరావుకు వివరణ కోరగా అక్రమ నిర్మాణాలు తమ దృషికి రాలేదని, పరిశీలిస్తామని తెలిపారు.

మత్స్య పరిశ్రమ వైపు యువత దృష్టి సారించాలి

» మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణరావు


వలల తయారీపై శిక్షణ అందిస్తున్న మత్స్యశాఖ అధికారులు

బీచ్ రోడ్డు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మత్స్య పరిశ్రమలో జరిగిన పరిశోధన ఫలితాలు నేడు ప్రపంచ అభివృద్ధికి ఎంతగానో దోహదపడ్డాయని మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణరావు పేర్కొన్నారు. మంగళవారం నిఫ్‌పాట్ కార్యాలయంలో సముద్ర నాచు పెంపకంపై మత్స్యకార యువతీయువకులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్య శాఖ రంగంలో పరిశోధనలు చేపట్టే వారికి సాంకేతిక పరికరాలు, సమర్థ వినియోగంపై తప్పనిసరిగా అవగాహన ఉన్నప్పుడే పరిశోధనా ఫలితాలు అద్భుతంగా ఉంటాయన్నారు. మత్స్య పరిశ్రమల వైపు యువత దృష్టి సారించేలా వారి ఆలోచనలో మార్పు వచ్చే విధంగా బోధనా సిబ్బందితో పాటు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. జిల్లాలో సముద్ర నాచు పెంపకానికి అనువైన ప్రాంతాలు, నాచు రకాలు ట్యూబ్, రాఫ్ట్ పద్ధతిలోనే నాచు పెంపకం, సముద్ర నాచు ఎండబెట్టడం, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించబడినదని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ఇన్‌చార్జి డాక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ సముద్ర నాచుతో తయారు చేసిన ఆహార ఉత్పత్తులు, విలువ ఆధారిత మత్స్య ఉత్పత్తులపై అవగాహన కల్పించడం చాలా ముఖ్యమన్నారు. చేపల వేట, వలలు అల్లటం తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం వనరులను ఉపయోగించుకొని నియమావళికి అనుగుణంగా చేపలు పట్టడం, చేపలు పట్టేందుకు మెళకువలు, చిన్న చేపలు కూడా తప్పించుకోకుండా ఉండేలా వలల అల్లిక తదితర అంశాలను బోధించడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఎంఎఫ్ఆర్ఐ శాస్త్రవేత్త డాక్టర్ శేఖర్ మేఘరాజన్, డెప్యూటీ డైరెక్టర్ హెచ్.బిషోయ్, డాక్టర్ మీనా కోటేశ్వరరావు, రమ్య, ఎఫ్‌డీవో ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికపై కార్పొరేటర్లకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న అదనపు కమిషనర్లు

వెంకోజీపాలెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6న బుధవారం జరగనున్న జీవీఎంసీ స్థాయీ సంఘం ఓటింగ్ ప్రక్రియపై కార్పొరేటర్లకు అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ అవగాహన కల్పించారు. జీవీఎంసీ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఎన్నికల నియమావళి మేరకు సభ్యులంతా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నిక జరుగుతుందని, పోలింగ్ కేంద్రంలోకి వెళ్లే ముందు స్టేషన్ బయట ఉన్న ఓటర్ ఐడెంటిఫికేషన్ అధికారి వద్ద ఐడీ కార్డును చూపించి, ఓటర్ స్లిప్పు తీసుకుని ప్రవేశించాలన్నరు. పెన్నులు, పెన్సిల్లు, మార్కర్ పెన్నులు, డిజిటల్ వాచీలు, సెల్ ఫోన్లు, ఎలక్ట్రికల్ పరికరాలు అనుమతించమన్నారు. బ్యాలెట్ పేపర్లో అభ్యర్థికి ఎదురుగా ఉన్న గడిలో ఓటర్ మార్కువేయాలని, పది మంది సభ్యుల్ని ఎన్నుకోవాల్సి ఉన్నందున ఒక ఓటరు 10 ఓట్లు మాత్రమే వేయాలని, ఎక్కువ ఓట్లు వేస్తే బ్యాలెట్ చెల్లదన్నారు. పోటీలోని అభ్యర్థులు ఉదయం 9.45 గంటలకు బ్యాలెట్ బాక్సులు సీల్ వేసే కార్యక్రమానికి హాజరు కావాలని, పోలింగ్ ముగిసిన తరువాత సీల్ వేసే సమయంలో అభ్యర్థులు ఉండాలన్నారు. వారి సమక్షంలోనే ఓట్ల లెక్కింపు జరుగుతుందని, వెంటనే ఫలితాలను వెల్లడిస్తారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి బీవీ రమణ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమం

» ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు


కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

పెదవాల్తేరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత క్రమ పద్ధతిలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. జీవీఎంసీ 20వ వార్డు చినవాల్తేరు హోమన హోటల్, రజకవీధి తదితర ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు టీడీపీ వార్డు అధ్యక్షుడు బైరెడ్డి పోతన్నరెడ్డి తదితరులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. ఏడాది పాలనలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ కూటమి అభివృద్ధి పాలనలో నియోజకవర్గంలో ప్రజల నుంచి చక్కని స్పందన వచ్చిందన్నారు. ఎన్నికల ముందు తాము ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయడంలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబు, ఉపముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ మాట తప్పడం లేదన్నారు. తల్లికి వందనం, ఫీజు రీ-యింబర్స్‌మెంట్, సామాజిక పింఛన్లు, తదితర పథకాలను పక్కాగా అమలు చేస్తున్నారన్నారు. ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేయనున్నట్టు చెప్పారు. నియోజక వర్గంలో ఏమైన సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలపై కొందరు ఎమ్మెల్యేకు వినత పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీతల అమరేంద్ర, అవినాష్ యాదవ్, మూర్తి యాదవ్, కంభాపు శివారెడి పాల్గొన్నారు.

నిరంకుశ ఉత్తర్వులు రద్దు చేయాలి

» పీడీఎస్వో ఆందోళన


కృష్ణా కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న పీడీఎస్వో కార్యకర్తలు

మద్దిలపాలెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు మినహాయిస్తే ఇతరవ్యక్తులు, సంస్థలు పాఠశాల ప్రాంగణంలోకి ప్రవేశించడాన్ని నిషేధిస్తూ విద్యామండలి జారీ చేసిన నిరంకుశ ఉత్తర్వులు రద్దు చేయాలని పీడీఎస్వో జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి డిమాండ్ చేశారు. విద్యామండలి ఉత్తర్వులకు వ్యతిరేకంగా డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గేటు వద్ద పీడీఎస్వో కార్యకర్తలు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థి సంఘాల గొంతు నులిమే కుట్రల్లో ప్రభుత్వం ఈ ఉత్తర్వులిచ్చిందన్నారు. ఉపాధ్యాయుల స్వేచ్ఛ, ప్రజాస్వామ్య హక్కులను హరించి పాఠశాలలను జైళ్లుగా మార్చే విధంగా విద్యామండలి ఉత్తర్వులున్నాయని విమర్శించారు. ఇప్పటికే విలీనం పేరుతో అనేక ప్రాథమిక పాఠశాలలు అన్యాయంగా మూసివేశారన్నారు. పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేవన్నారు. పుస్తకాలు, యూనిఫాంల పేరుతో ప్రైవేటు పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. విద్యార్థి సంఘాలు ఈ సమస్యలపై పోరాటం చేస్తున్నాయని, ఇలాంటి సమయంలో పాఠశాలల్లోకి ప్రవేశం లేకపోతే దోపిడీ మరింత పెరిగిపోతుందన్నారు. కార్యక్రమంలో పీడీఎస్వో జిల్లా కమిటీ సభ్యులు సతీష్, లక్ష్మణ్, జానకి తదితరులు పాల్గొన్నారు.

రెండున్నర టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం : ఒకరి అరెస్టు

పెదగంట్యాడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పంపిణీకి చెందిన బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని మంగళవారం రాత్రి న్యూపోర్టు పోలీసులు అరెస్టు చేసి రెండున్నర టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీఐ టి.కామేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రేషన్ బియ్యాన్ని బొలేరో వాహనంలో కొత్త దిబ్బపాలెం నుంచి వేరే ప్రాంతానికి తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు సీఐ కామేశ్వరరావు తమ సిబ్బందితో కొత్త దిబ్బపాలెం రహదారిపై వాహనాన్ని పట్టుకున్నారు. బియ్యం తరలిస్తున్న ఈసరపు నానిని అరెస్టు చేశారు.

సినిమా గైడ్

- **సార్, మేడమ్** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **కింగ్డమ్** : జగదాంబ
- **సన్ ఆఫ్ సర్దార్** : రమాదేవి
- **మహావతార్ నరసింహ** : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **హరిహర వీరమల్లు** : శారద, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 44, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 38, పచ్చిమిర్చి 56, కాకరకాయలు 32, బీరకాయలు 42, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 16, క్యారెట్ 44, దొండకాయలు 40, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 74, బరబాటి 32, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 50, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 84, కీరదోస 30, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 42, దేముడు చిక్కుడు 102, గోరు చిక్కుడు 38, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	475
విజయనగరం	479
శ్రీకాకుళం	479

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	85
లైవ్ ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	190

స్మార్ట్ మీటర్ల బిగింపు నిలిపివేయాలి

» ప్రజాసంఘాల నేతల డిమాండ్



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

సీతమ్మధార, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులకు నష్టదాయకమైన ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్ల బిగింపు చర్యలను తక్షణం నిలిపివేయాలని, ఇప్పటికే బిగించిన మీటర్లను తొలగించి పాత మీటర్లను కొనసాగించాలని విశాఖపట్నం కార్మిక, మహిళా యువజన, విద్యార్థి తదితర ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. సర్దుబాటు, ట్రూఅప్, ఇంధన చార్జీల పేరుతో వేసిన భారాలు ఉపసంహరించకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మంగళవారం గురుద్వార రోడ్డులో ఉన్న ఏపీఈపీడీసీఎల్ ఎదుట సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ, ఐద్వా, ఎస్ఐఎఫ్‌డబ్ల్యు, పీఓడబ్ల్యు, డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, కేవీపీఎస్ తదితర ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్ అచ్యుతరావులు అధ్యక్షతన జరిగిన ధర్నాలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సంస్కరణల పేరుతో విద్యుత్ కంపెనీలను అదానీ లాంటి బహుళజాతి సంస్థలకు కట్టబెడుతుంటే రాష్ట్రంలో కూటమి పెద్దలు దానికి సహకరించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ప్రజల సంపదను లూటీ చేయడమే కాకుండా, విద్యుత్ భారాలు మోపడం సరైందికాదని హెచ్చరించారు. ఇదే చంద్రబాబు 2000లో భారీగా విద్యుత్ చార్జీలు పెంచితే నాడు ఉమ్మడి రాష్ట్రంలో ప్రజలు ఐక్యంగా తిప్పికొట్టారని గుర్తుచేశారు. ఆగస్టు 28న 'చలో హైదరాబాద్' కార్యక్రమంలో చంద్రబాబు ప్రభుత్వం ముగ్గురిని పొట్టన పెట్టుకుందని గుర్తు చేశారు. ఇప్పుడు మరో విద్యుత్ పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రెహ్మాన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వీ కుమార్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు ఎం.వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, పీఓడబ్ల్యు లక్ష్మి, ఏఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి దేవా, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు యూఎస్ఎన్ రాజులు మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే బద్దలు కొట్టండని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు లోకేశ్ పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక దొంగచాటుగా మీటర్లు ఎందుకు బిగిస్తున్నారని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్ల వలన ప్రజలపై మరింత భారం పడుతుందని, ఇప్పటికే బిగించిన మీటర్లకు బిల్లులు భారీగా పెరిగి ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా ఈపీడీసీఎల్ అధికారులకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో వై.సత్యవతి, వనజాక్షి, వై.రాజు, కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, పి.మణి, బి.జగన్, ఒ.అప్పారావు, ఎం.సుబ్బారావు, బొట్టా ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు అలవరచుకోవాలి : సీపీ


విద్యార్థి నాయకులను అభినందిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

వెంకోజీపాలెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని నగర పోలీసు కమిషనర్ శంఖాబ్రత బాగ్చీ సూచించారు. మంగళవారం ఇసుకతోటలోని శ్రీచైతన్య ఆంగ్ల మాధ్యమ పాఠశాల లో విద్యార్థి నాయకుల ఎన్నిక కార్యక్రమంలో సీపీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో నాయకత్వం వహిస్తే భవిష్యత్తులో ఉన్నత నాయకత్వ లక్షణాలను పెంపొందించుకునే అవకాశాలు మెండుగా దక్కుతాయన్నారు. విద్యార్థి దశ నుంచే ఉన్నత ఆశయాలు నిర్దేశించుకోవాలని, వాటి కోసం అహర్నిశలు కృషి చేయాలని, మధ్యలో వచ్చే ఆటుపోట్లను తట్టుకుంటూ విజయం కైవసం చేసుకోవాలని చెప్పారు. అపజయాలు అశాశ్వతమని, విజయాలు శాశ్వతమని చెబుతూ విజయాన్ని పొందే వరకు విశ్రమించవద్దని హితవు పలికారు. నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులను సీపీ అభినందించారు. తొలుత విద్యార్థులు మార్చ్‌పాస్ట్ నిర్వహించి సీపీకి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో శ్రీచైతన్య ఉత్తరాంధ్ర జిల్లాల ఏజీఎం సురేష్, శ్రీచైతన్య పాఠశాలల రీజనల్ ఇంచార్జి మొహమ్మద్ అలీ, స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.రమణి, డీన్‌లు అప్పలనాయుడు, జగదీశ్, ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భూలోకమాత మారువారం


ఘటాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

వెంకోజిపాలెం, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెంలోని జాతీయ రహదారి పక్కనున్న భూలోకమాత అమ్మవారి మారువారం పండుగ మంగళవారం కన్నులపండవగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు గ్రామ సేవా సంఘం పాలకకార్యవర్గ సభ్యులు, కస్తూరి మహిళా మండలి, కిరణ్మయి మహిళా మండలి, యూత్ కమిటీ సభ్యులు తొలి పూజను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు అమ్మవారి ఘటాన్ని తలపై మోస్తూ ఊరేగించారు. అనంతరం భక్తులకు దర్శనాన్ని కల్పించారు. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు వెలగపూడి ప్రతాప్‌రుద్ర పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్న వితరణ చేశారు. అనంతరం హైదరాబాద్‌లో నిర్వహించే బోనాలు వేడుకను తలపించేలా మహిళలంతా బిందెలతో వీధులలో ఊరేగింపు చేపట్టి, అనంతరం ఆ నీటితో అమ్మవారికి అభిషేకం చేయించారు. పెద్దింటమ్మ వీధి నుంచి ప్రారంభమైన ఈ ఊరేగింపు గ్రామపెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు ఆడారి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పీల ప్రేమ్ కిరణ్ జగదీశ్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు సూరిశెట్టి సిమ్మినాయుడు, మళ్ల రవికుమార్, కోరిబిల్లి ఈశ్వరరావు, శరకం అప్పలరాజు, కాళ్ల ఆనంద్, మాజీ అధ్యక్షుడు మద్దాల వీరవెంకట అప్పారావు, బోర ధనరెడ్డి, కాళ్ల శంకర్, ఆడారి కామేశ్వరరావు, కాళ్ల వరహాలు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, మహిళా మండలి సభ్యురాలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

పారా అథ్లెటిక్స్ పోటీల్లో దివ్యాంగులు సత్తా చాటాలి : కలెక్టర్


వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, క్రీడాధికారులు

మహారాణిపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా ఈ నెల 9 నుంచి పోలీసు బ్యారెక్స్ గ్రౌండ్‌లో రాష్ట్రస్థాయి 6వ జూనియర్, సబ్ జూనియర్ దివ్యాంగుల పారా అథ్లెటిక్స్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు సంబంధించి గోడ పత్రికను కలెక్టర్ ఎంఎన్‌హరేంధిర ప్రసాద్ మంగళవారం ఆవిష్కరించారు.పారా స్పోర్ట్సు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి ఆధ్వ ర్యంలో స్పోర్ట్సు అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ విశాఖ వేదికగా జరిగే ఈ పోటీలకు అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు రావాలని పిలుపునిచ్చారు. ప్రతిభ కనబరచి జాతీయస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌కు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారులు ఎస్.వెంకటేశ్వరరావు, వి.రామస్వామి,శీతల్‌మదన్, వై.శ్రీనివాస్ గౌడ్, టి.రాము, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


తల్లిపాలే పిల్లలకు శ్రేష్ఠం

» మహిళ శిశు సంక్షేమ శాఖ పీడీ రామలక్ష్మి


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : బిడ్డల ఆరోగ్యానికి తల్లిపాలు శ్రేష్ఠమైనవని ఐసీడీఎస్ మహిళ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కేవీ రామలక్ష్మి అన్నారు. జీవీఎంసీ 18వ వార్డులోని అప్పుఘర్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాలులో మంగళవారం నిర్వహించిన ప్రాజెక్టు స్థాయి సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింత మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పౌష్టికాహారాన్ని అందరూ వినియోగించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారుల ఎదుగుదల విషయంలో పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. స్త్రీల వైద్య నిపుణురాలు కిరణ్మయి మహిళలకు పిల్లల సంరక్షణ విషయంలో తీసుకోవాల్సిన అంశాలను వివరించారు. అంతకుముందు అధికారులు, సిబ్బంది తల్లిపాల వారోత్సవాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల వినియోగంపై తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గొలగాని మంగవేణిపోలారావు, అర్బన్ సీడీపీవో నీలిమ, సహాయక సీడీపీవో శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకమ్మ పండుగ


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న కార్యవర్గ సభ్యులు

వెంకోజీపాలెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : పాత వెంకోజీపాలెంలోని వేంచేసి ఉన్న కనకమాంబ అమ్మవారి పండుగ మంగళవారం ఘనంగా జరిగింది. శ్రీ రాధాకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో గ్రామంలోని మహిళలు తెల్లవారు జాము 4 గంటలకు అమ్మవారిని నీలాభిషేకం చేసి శుద్ధి చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు తమ ఇంటి నుంచి కళశాలతో నీటిని తీసుకువచ్చి,పురవీధుల్లో ఊరేగి అనంతరం అమ్మవారికి నీలాభిషేకం చేపట్టారు. తరువాత సంఘం కార్యవర్గ సభ్యులు అమ్మవారికి తొలి పూజ నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. ఈ పండుగలో టీడీపీ నాయకులు ఈగల సత్యం, శ్రీరాధాకృష్ణ యాదవ సేవా సంఘం ఉపాధ్యక్షుడు పల్లాపెంటారావు, ప్రధాన కార్యదర్శి ఒమ్మి కోటిబాబు, కార్యదర్శి ఒమ్మి అప్పలరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మిరాజు, సహాయ కార్యదర్శి జోగ రాంబాబు, కోశాధికారి శ్రీను, సహాయ కోశాధికారి జగ్గారావు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఎమ్మెల్యే బహుమానం

మహారాణిపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): క్వీన్‌మేరీ పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని అక్షయను దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ అభినందిస్తూ రూ.10 వేల బహుమానం అందజేశారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించటంతో పాటు శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీలో అక్షయ సీటు సంపాదించింది. మంగళవారం క్వీన్‌మేరీ పాఠశాలలో ఆమెకు ఎమ్మెల్యే పది వేల బహుమానం అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు వర్మ, ఉపాధ్యాయులు, అక్షయ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి వైద్య పరీక్షలు


కానిస్టేబుల్‌కు రక్త నమూనా తీస్తున్న దృశ్యం

మహారాణిపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో నగర పోలీసు సిబ్బందికి మంగళవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఏటా మాదిరి ఈసారి కూడా సుమారు 2,700 మంది పోలీసు సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించేం కు ఏర్పాట్లు చేశారు. రోజూ 150 మంది వంతున ఈ నెలాఖరు వరకు వైద్య పరీక్షలు చేస్తారు. ఈ సందర్భంగా నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ పోలీసు సిబ్బందికి మాత్రమే కాకుండా, వారి కుటుంబ సభ్యులకు కూడా వైద్య పరీక్షలు చేయిస్తామన్నారు.

కుష్టు రోగులకు సేవలు ప్రశంసనీయం


మాట్లాడుతున్న ఎస్.ఎస్.రాజు

డాబాగార్డెన్స్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రేమసమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుష్టు శరణాలయం 71వ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ఏజ్ కేర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ఎస్.ఎస్.రాజు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమ సమాజం సేవా కార్యక్రమాల్లో కుష్టు రోగులకు ఆశ్రయం కల్పించి ఆదరించడం గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నరసింహమూర్తి, మోహన్‌రావు, గుప్తా, వెంకటరావు, సత్యనారాయణ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే జరిమానా


ఓ దుకాణంలో తనిఖీ చేస్తున్న బృందం

సీతమ్మధార, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చిరువ్యాపారులు ప్లాస్టిక్ సంచుల వినియోగం మానకపోతే జరిమానా వసూలు చేయక తప్పదని జీవీఎంసీ ఎస్ఎస్ సత్యనారాయణ హెచ్చరించారు. సీతమ్మధార, మద్దిలపాలెం ప్రాంతాల్లో చిరువ్యాపారుల దుకాణాల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్ సంచుల వినియోగంతో జరిగే నష్టాలను వివరించారు. వ్యాపారుల వద్ద 3.5 కేజీల ప్లాస్టిక్ సంచులు సీజ్ చేశారు.

నేటి నుంచి బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ తాత్కాలిక రద్దు

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని కొత్తవలస, పెందుర్తి సెక్షన్‌లో ఆధునికీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 6 నుంచి 8 వరకు విశాఖ-బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్‌ను (18526), తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్-విశాఖ ఎక్స్‌ప్రెస్‌ను (18525) ఈ నెల 7 నుంచి 9 వరకు తాత్కాలికంగా రద్దు చేసినట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

బియ్యం అక్రమ రవాణాపై నిఘా

... 5వ పేజీ తరువాయి

సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విశాఖ పోర్టు నుంచి విదేశాలకు ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉన్న పీడీఎస్ బియ్యాన్ని ఇటీవల పట్టుకున్న విషయాన్ని గుర్తుచేశారు. పోర్టు నుంచి పీడీఎస్ బియ్యం రవాణాను నిలిపివేయాలన్నారు. ఇందుకు నిఘా ముమ్మరం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, పోర్టు, కస్టమ్స్ కలిసి సంయుక్తంగా తనిఖీలు చేయాలన్నారు. దీనికి పోస్టు కార్యదర్శి వేణుగోపాల్ మాట్లాడుతూ పోర్టు నుంచి అన్ని రకాల సహకారం అందిస్తామని, రేషన్ బియ్యం స్టోరేజీకి అనుమతి ఇవ్వొద్దని ఫ్రైట్ స్టేషన్లకు సూచనలు చేస్తామన్నారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్‌గౌర్, జేసీ మయూర్ అశోక్ పాల్గొన్నారు.

గ్రేటర్‌లో రాజకీయ సందడి

... 5వ పేజీ తరువాయి

బహిష్కరిస్తున్నట్టు సీపీఎం కార్పొరేటర్ బిగంగారావు ప్రకటించారు. కౌన్సిల్‌లో గతంలో అధికారంలో ఉన్న వైసీపీపాలన మాదిరిగానే ప్రస్తుత కూటమి పాలన అవినీతిమయంగా మారిందని ఆయన ఆరోపించారు. మేయర్ ఉప ఎన్నిక సందర్భంగా కార్పొరేటర్లను సంతలో సరుకులు కొన్నట్టు కొనుగోలు చేశారన్నారు. సీపీఎం మొదటి నుంచి అవినీతి రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తోందన్నారు. పార్టీ జిల్లా నాయకత్వం ఆదేశాలకు అనుగుణంగా బుధవారం జరిగే స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఓటింగ్‌కు గైర్హాజరవుతున్నట్టు స్పష్టంచేశారు.

స్మార్ట్ మీటర్ల బిగింపు తక్షణం నిలిపివేయాలి

» ప్రజాసంఘాల నేతల డిమాండ్


ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు

సీతమ్మధార, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు భారమైన ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణం నిలిపివేయాలని, ఇప్పటికే బిగించినవాటిని తొలగించి పాత మీటర్లను కొనసాగించాలని కార్మిక, మహిళా, యువజన, విద్యార్థి తదితర ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. సర్దుబాటు, ట్రూఅప్, ఇంధన సర్దుబాటు పేరుతో వేసిన భారాలు ఉపసంహరించకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మంగళవారం గురుద్వార రోడ్డులో ఉన్న ఏపీఈపీడీసీఎల్ ఎదుట సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ, ఐద్వా, ఎన్ఐఎఫ్‌డబ్ల్యు, పీఓడబ్ల్యు, డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, కేవీపీఎస్ తదితర ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్ అచ్యుతరావు నాయకత్వంలో జరిగిన ధర్నాకు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం మద్దతు ప్రకటించారు. లోకనాథం మాట్లాడుతూ కేంద్రం సంస్కరణల పేరుతో విద్యుత్ కంపెనీలను అదానీ లాంటి బహుళజాతి పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతుంటే రాష్ట్రంలో కూటమి పెద్దలు సహకరించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ప్రజల సంపదను లూటీ చేయడమే కాకుండా, విద్యుత్ భారాలు మోపడం సరైందికాదని హెచ్చరించారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని ప్రజలు ఐక్యంగా తిప్పికొట్టారని గుర్తుచేశారు. ఇప్పుడు మరో విద్యుత్ పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రెహ్మాన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వీ కుమార్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు ఎం.వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, పీఓడబ్ల్యు లక్ష్మి, ఏఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి దేవా, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు యూఎస్ఎన్ రాజులు మాట్లాడారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే బద్దలు కొట్టండని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పిలుపునిచ్చిన ప్రస్తుత మంత్రి లోకేశ్ అధికారం దక్కాక చేస్తున్నదేమిటని ప్రశ్నించారు. ఈపీడీసీఎల్ అధికారులకు వినతిపత్రం అందచేశారు. వై.సత్యవతి, వనజాక్షి, వై.రాజు, డాక్టర్ బి.గంగారావు, పి.మణి పాల్గొన్నారు.

క్యాన్సర్లపై అవగాహనకు ప్రత్యేక శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య బృందం

మహారాణిపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్లపై అవగాహన కల్పించేందుకు కేజీహెచ్‌లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో ఇంటింటి సర్వేను విజయవంతం చేయటానికి ముందస్తు ఏర్పాట్లలో భాగంగా ఓరల్, సర్వైకల్, బ్రెస్ట్ క్యాన్సర్లపై అవగాహన కల్పించేందుకు మంగళవారం కేజీహెచ్‌లో మాస్టర్ ట్రైనర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఇందుకోసం ఎంపికైన వైద్యులు, గైనకాలజిస్టు, దంత వైద్యులు ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఆర్ఎమ్‌వో డాక్టర్ శ్రీహరి, అంకాలజీ యూనిట్ డాక్టర్ కె.సాయి సుష్మ, డాక్టర్ వి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక పునరుజ్జీవనం కోసమే సీవీ రచనలు

ఆచార్య కె.ఎస్.చలం


ప్రసంగిస్తున్న ఆచార్య కె.ఎస్.చలం

సీతంపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక పునరుజ్జీవనం కోసమే చిత్తజల్లు వరహాలరావు (సీవీ) రచనలు సాగాయని ఆచార్య కె.ఎస్.చలం పేర్కొన్నారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో సమతా సాహితి సామాజిక సాహిత్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం సీవీ సాహిత్యంపై సమీక్ష సభ నిర్వహించారు. డాక్టర్ మాటూరి అధ్యక్షతన జరిగిన ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆచార్య చలం మాట్లాడుతూ సీవీ రచనలను విశ్లేషించారు. సీవీ రచనల్లో సామాజిక అంశాలపై డాక్టర్ ఎం.సుబ్బారావు మాట్లాడారు. ఈ సమావేశంలో డాక్టర్ క్షేత్రపాల్ రెడ్డి, డాక్టర్ బండి సత్యనారాయణ, రచయిత ఉప్పల అప్పలరాజు, డి.వి.సూర్యారావు, వేమన, మహేష్, చిన్నారావు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం


కుట్టుశిక్షణ పొందిన మహిళలతో కార్పొరేటర్ కందుల నాగరాజు

అల్లిపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని 32వ వార్డు కార్పొరేటర్, జనసేన నాయకుడు కందుల నాగరాజు అన్నారు. అల్లిపురంలోని నేరెళ్ల కోనేరు వద్ద మూడు నెలలుగా జరుగుతున్న ఉచిత కుట్టు శిక్షణ ముగింపు కార్యక్రమం మంగళవారం ఏర్పాటు చేయగా, నాగరాజు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా శిక్షణ కేంద్రాల ద్వారా 1,02,832 మంది మహిళలు కుట్టు నేర్చుకున్నారని తెలిపారు. అనంతరం మహిళలు కార్పొరేటర్ కందుల నాగరాజు, బీసీ కార్పొరేషన్ కో-ఆర్డినేటర్ బాలును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు జానకి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆకాశవాణిలో 'పరమ వీరచక్ర'

డాబాగార్డెన్స్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రంలో బుధవారం (నేడు) ఉదయం 7.20 గంటల నుంచి 'పరమవీర చక్ర' శీర్షికన ప్రసంగ ధారావాహికను ప్రసారం చేస్తుందని కార్యక్రమ విభాగాధిపతి కె.ఇందిర తెలిపారు. ఇప్పటి వరకు పరమ వీరచక్ర అవార్డు పొందిన 21 మంది సైనిక వీరుల జీవితాలను, వారి ధైర్య సాహసాలను, త్యాగ నిరతిని, పోరాట స్ఫూర్తిని శ్రోతలకు అందించాలనే సంకల్పంతో 21 భాగాలుగా ఈ ధారావాహికను రూపొందించి ప్రసారం చేస్తున్నట్టు తెలిపారు. భారతదేశ త్రివిధ దళాలలో పనిచేస్తున్న అధికారులు, విశ్రాంతి పొందిన మాజీ సైనిక అధికారుల ప్రసంగాలు ఈ ధారావాహికలో ప్రసారం అవుతాయన్నారు. ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రానికి అనుబంధంగా ఉన్న ఎఫ్ఎం కేంద్రాలు ప్రసారం చేస్తాయని ఇందిర తెలిపారు.

పారా అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటాలి: కలెక్టర్


పోటీల గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా ఈ నెల 9 నుంచి పోలీసు బ్యారెక్స్ గ్రౌండ్‌లో రాష్ట్రస్థాయి 6వ జూనియర్, సబ్ జూనియర్ దివ్యాంగుల పారా అథ్లెటిక్స్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు సంబంధించి గోడ పత్రికను కలెక్టర్ ఎంఎన్‌హరేంధిర ప్రసాద్ మంగళవారం ఆవిష్కరించారు. పారా స్పోర్ట్సు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి ఆధ్వర్యంలో స్పోర్ట్సు అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ విశాఖ వేదికగా జరిగే ఈ పోటీలకు అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు రావాలని పిలుపునిచ్చారు. ప్రతిభ కనబరచి జాతీయస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌కు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. జిల్లా క్రీడాధికారులు ఎస్.వెంకటేశ్వరరావు, వి.రామస్వామి, శీతల్ మదన్, వై.శ్రీనివాస్ గౌడ్, టి.రాము, సత్యనారాయణ పాల్గొన్నారు.

సముద్ర నాచు పెంపకంపై మత్స్యకారులకు శిక్షణ


మత్స్యకారులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

డాబాగార్డెన్స్ ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని సిఫ్ నెట్ కార్యాలయంలో మత్స్యకార మహిళలకు, యువతకు సముద్ర నాచు పెంపకంపై మత్స్యశాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. జిల్లాలో అనువైన ప్రాంతాలు, నాచు రకాలు, ట్యూబ్, రాఫ్ట్ పద్ధతిలో నాచు పెంపకం, సముద్ర నాచు ఎండబెట్టడం, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు. అదే విధంగా సముద్ర నాచుతో తయారు చేసిన ఆహార ఉత్పత్తులు, విలువ ఆధారిత మత్స్య ఉత్పత్తులపై అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐఎఫ్‌టీ ఇన్‌చార్జ్ డా.మధుసూదనరావు, శాస్త్రవేత్త డా.శేఖర్ మేఘరాజన్, సీఐఎఫ్ఎన్ఈటీ డిప్యూటీ డైరెక్టర్ హెచ్.బి.బిషోయ్, నిఫ్‌డీడీ మీనా, కోటేశ్వరరావు, రమ్య, మత్స్యశాఖ జేడీ పి.లక్ష్మణరావు, ఏడీ విజయకృష్ణ, ఎఫ్‌డీఓ ఆశాజ్యోతి, డీపీఎం కృష్ణ, రవి పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



బాలికల ఐటీఐ ప్రాంగణంలో ప్రమాదకరంగా కనిపిస్తున్న ప్రహరీ గోడ

కంచరపాలెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ బాలికల ఐటీఐ ప్రాంగణంలో ఓ ప్రహరీ గోడ పగిలిపోయి కూలేస్థితిలో ఉంది. నిత్యం ఐటీఐ శిక్షణకు విద్యార్థులు వస్తున్న నేపథ్యంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఇదే కార్యాలయం మేడ పైన ఉప ప్రాంతీయ సంచాలకుల కార్యాలయం కూడా ఉంది. అధికారులు అప్రమత్తమై అవాంఛనీయ ఘటన జరగక ముందే చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, స్థానికులు కోరుతున్నారు.

బీఎల్‌వోల నియామకం తక్షణమే పూర్తిచేయండి: ఆర్‌వో


సమావేశంలో పాల్గొన్న ఆర్‌వో జ్ఞానవేణి, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు తదితరులు

సీతమ్మధార, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా పరిశీలన, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు అంశంపై ఉత్తర నియోజకవర్గానికి చెందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సీతమ్మధారలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్ తదితరులు పాల్గొన్నారు. బూత్ లెవెల్ ఏజెంట్ల (బీఎల్‌వోల) నియామకం అత్యవసరమని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసిన నేపథ్యంలో, అన్ని రాజకీయ పార్టీలు వెంటనే ఆ పని పూర్తి చేసి సమాచారం తెలియజేయాలని జ్ఞానవేణి కోరారు. ఈ సమావేశంలో నాయకులు, తహసీల్దార్ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

చారిత్రక అంశాల అధ్యయన పర్యటన



మ్యూజియం వద్ద విద్యార్థినులు

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులకు చరిత్ర, రాజనీతిశాస్త్రం, అర్థశాస్త్రంపై అవగాహన కల్పించడంలో భాగంగా బీచ్‌రోడ్డులోని విశాఖ మ్యూజియంకు విద్యా అభ్యాసన పర్యటన నిర్వహించామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. భారతదేశ చారిత్రక వారసత్వానికి సంబంధించిన పలు పురాతన వస్తువులు, నౌకాదళ సామగ్రి, గడియారాలు, కరెన్సీ వంటి వాటిపై అధ్యాపకులు ఆర్.డి.విశ్వేశ్వరరావు విద్యార్థినులకు వివరించారన్నారు. ఇటువంటి పర్యటనల ద్వారా వారిలో విషయ పరిజ్ఞానం పెంపొందుతుందని అభిప్రాయపడ్డారు. 90 మంది విద్యార్థినులు, అధ్యాపకులు డాక్టర్ కె.గీతాంజలి, ఎస్.రాజేష్, డాక్టర్ బి.నాగమణి, జి.జ్యోతి మ్యూజియాన్ని సందర్శించారు.

రచయిత మంజీరకు సాహితీ పురస్కారం


రచయిత మంజీరకు సాహితీ పురస్కారం అందజేసి సత్కరిస్తున్న ప్రముఖులు

సీతంపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రచయిత సమాజానికి మార్గదర్శకంగా ఉంటూ, పాఠకులను ప్రభావితం చేయాలని ప్రముఖ రచయిత ఎంవీవీ సత్యనారాయణ ఆకాంక్షించారని, ఆయన రచనలు కన్నడ, హిందీ భాషలలో అనువాదం పొందాయని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మంగళవారం రైటర్స్ అకాడమి ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత ఎంవీవీ సత్యనారాయణ స్మారక పురస్కారం 2025 ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైటర్స్ అకాడమి వ్యవస్థాపకుడు వి.వి.రమణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అతిథులుగా నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య వి.బాలమోహన్‌దాస్, ప్రముఖ రచయితలు ద్విభాష్యం రాజేశ్వరరావు, ఎన్‌కె బాబు, సాహితీవేత్త, సమన్వయకర్త మేడా మస్తాన్‌రెడ్డిలు విచ్చేశారు. ఎంవీవీ సత్యనారాయణ రచనలు, రచనా శైలి, ఆయనతో వారికి గల అనుబంధాన్ని వివరించారు. అనంతరం ఎంవీవీ సత్యనారాయణ కుటుంబ సభ్యులు, అతిథులు ప్రముఖ కథా రచయిత గంధం నాగేశ్వరరావు (మంజరి)కు ఎంవీవీ స్మారక సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. ప్రముఖ విద్యావేత్త, ఉచిత విద్యా బోధకులు డాక్టర్ కొచ్చర్లకోట వెంకట సత్యనారాయణమూర్తిని సత్కరిస్తూ ఎంవీవీ సత్యనారాయణ స్మారక సేవా పురస్కార గ్రహీత అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు, రచయితలు, రైటర్స్ అకాడమి ప్రతినిధులు పాల్గొన్నారు.

నగరం నిప్పులకొలిమి

... 5వ పేజీ తరువాయి

కానరావడం లేదు. మంగళవారం గాలులు వేగం మందగించడంతో వేడి మరింత పెరిగి నగరం నిప్పుల కొలిమిలా మారింది. వాతావరణ శాఖ అధికారులకు కూడా ఈ వాతావరణం అంతుచిక్కడం లేదు. ప్రతిరోజు నగరంలో చెదురుమదురు వర్షాలు కురుస్తాయని ఇస్తున్న బులెటిన్లు తప్పు అవుతున్నాయి. మరికొన్నాళ్లు ఈ వేడి భరించాల్సి వచ్చేలా ఉంది.

ఒడిశా నుంచి ఫిషింగ్ బోట్ ఇంజన్ల అక్రమ రవాణా

... 5వ పేజీ తరువాయి

సమాచారం. విశాఖతో పాటు అనకాపల్లి జిల్లా నక్కపల్లి, అచ్యుతాపురం ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు వీటిని కొనుగోలు చేస్తుంటారని తెలిసింది. పెద్ద సంఖ్యలో ఈ ఇంజన్లు ఇక్కడికి రావడం వల్ల తమ వ్యాపారం తగ్గిపోయిందని గుర్తించిన వ్యాపారులే అక్రమ రవాణా సమాచారాన్ని వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు అందించినట్టు తెలిసింది.

జరిమానా వేసి విడిచిపెట్టాం

బిల్లులు లేకుండా బోటు ఇంజన్లు వస్తున్నాయని సమాచారం రాగా తనిఖీలు నిర్వహించి ఒక వాహనాన్ని పట్టుకున్నాం. అందులో మూడు ఇంజన్లు ఉండగా, ఒక దానికే బిల్లు ఉంది. మిగిలిన రెండింటికి బిల్లులు లేవు. కార్యాలయానికి వాహనాన్ని తీసుకువచ్చాక, జరిమానా వేసి విడిచి పెట్టాం.

- శ్రీనివాసరావు, ఇంటెలిజెన్స్ అధికారి, వాణిజ్య పన్నుల శాఖ

యథా కార్పొరేటర్లు! తథా అధికారులు!!

... 5వ పేజీ తరువాయి

సమావేశాల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన తీర్మానాలను మినహాయిస్తే పాలనాపరంగా తీసుకున్న నిర్ణయాలు, చేసిన తీర్మానాలు అమలు జరిగిన దాఖలాలు కనిపించడం లేదు. గతంలో చేసిన తీర్మానాల అమలు గురించి కార్పొరేటర్లు పట్టించుకోకపోవడంతో అధికారులు కూడా వాటిని సీరియస్‌గా తీసుకోవడం మానేశారు.

సమావేశం కోసం రూ.లక్షలు ప్రజాధనం ఖర్చు

మూడు నెలలకు ఒకసారి కౌన్సిల్ తప్పనిసరిగా సమావేశం కావాల్సి ఉంటుంది. ఒకసారి కౌన్సిల్ సమావేశం జరిగితే 97 మంది కార్పొరేటర్లు, ఐదుగురు కో-ఆప్షన్ సభ్యులు, 14 మంది ఎక్స్ అఫీషియో సభ్యులతోపాటు అధికారులు, కార్పొరేటర్ల అనుచరులు పాల్గొంటారు. అందరికీ ఉదయం టీ, స్నాక్స్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం మళ్లీ టీ, స్నాక్స్ అందుబాటులో ఉంచుతున్నారు. అలాగే సభ్యులకు కౌన్సిల్ హాల్‌లో మంచినీరు, శానిటైజర్ వంటివి అందజేసేందుకు ప్రత్యేకంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. వీటన్నింటి కోసం ఒక్కో సమావేశానికి రూ.లక్షల్లో ఖర్చుపెడుతున్నారు. అంత ప్రజాధనం వెచ్చించి నగరవాసుల ప్రయోజనాల కోసం నిర్ణయాలు తీసుకునేందుకు సమావేశాలు ఏర్పాటుచేస్తున్నారనే ప్రయోజనం ఉండడం లేదనే వాదనే వినిపిస్తోంది. ముఖ్యంగా జీవీఎంసీకి ఆదాయం వచ్చే మార్గాలను దెబ్బకొడుతున్న వారిపై చర్యలకు వెనుకాడుతున్నారు. అవినీతి అంశాలపై చర్యలకు సిద్ధపడినట్టు తీర్మానాలు చేసినా, వాటిని అమలు చేసేవిషయంలో మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కౌన్సిల్‌లో వన్‌టౌన్ హోల్‌సేల్ ఫ్రూట్‌మార్కెట్, జ్ఞానాపురంలోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో దుకాణాల అద్దెల్లో పెద్దఎత్తున గోల్‌మాల్ జరుగుతోందని అప్పటి ప్రతిపక్ష సభ్యులు ఆరోపించారు. దానిపై స్పందించిన అప్పటి మేయర్ గొలగాని హరివెంకటకుమారి ఆయా మార్కెట్లలో దుకాణాల అద్దెలను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలుజారీచేశారు. ఏమైందో తెలియదుగానీ అన్ని పార్టీల కార్పొరేటర్లతో అఖిలపక్ష కమిటీని నియమించి అక్కడితో వదిలేశారు. ఇప్పటికీ దుకాణాల అద్దెలు మాత్రం పెంచలేదు. అలాగే పాతజైలురోడ్డులో అనధికారికంగా నడుస్తున్న ఫుడ్‌కోర్టును తక్షణం తొలగించాలంటూ ఏడాది కిందట అప్పటి మేయర్ గొలగాని హరివెంకటకుమారి తీర్మానం చేశారు. ఇప్పటికీ ఫుడ్‌కోర్టు నిరాటంకంగా కొనసాగుతోంది. ఈ ఏడాది జూన్‌లో జరిగిన కౌన్సిల్ సమావేశంలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టుపై చర్చ జరిగినప్పుడు, ఆ ప్రాజెక్టు గడువు ముగిసినందున ఇకపై పొడిగించవద్దని అధికారులను మేయర్ పీలా శ్రీనివాసరావు ఆదేశించారు. కానీ నగరంలో మూడుచోట్ల కొత్తగా నిర్మించబోయే వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లను స్మార్ట్ సిటీ ఆధ్వర్యంలోనే చేపట్టేలా అధికారులు కసరత్తు ప్రారంభించడం విశేషం. ఇప్పటికైనా కొత్త మేయర్ పీలా శ్రీనివాసరావు కౌన్సిల్ తీర్మానాలు అమలు జరిగేలా చర్యలు తీసుకోవడం ద్వారా కౌన్సిల్ ఔన్నత్యాన్ని కాపాడాలని కార్పొరేటర్లు కోరుతున్నారు.

హాట్‌కేకుల్లా సీఎస్ఈ సీట్లు

... 5వ పేజీ తరువాయి

కాలేజీలు భర్తీ చేసుకున్నట్టు చెబుతున్నారు. అయితే, వీటిలెక్కలను అధికారులు వెల్లడించడం లేదు.

మేనేజ్‌మెంట్ సీటు హాట్ గురు..

జిల్లాలోని ప్రముఖ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు పోటీ నెలకొంది. మొదటి మూడు, నాలుగు స్థానాల్లో నిలిచే కాలేజీల్లో కంప్యూటర్ సైన్స్‌కు సంవత్సరానికి రూ.4 లక్షల నుంచి ఆరు లక్షల రూపాయల వరకూ తీసుకుంటున్నట్టు చెబుతున్నారు. ఒక ప్రముఖ కాలేజీలో అయితే రూ.ఏడు లక్షల వరకూ పలుకుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈసీఈ, ఐటీ వంటి బ్రాంచీలకు ఆ నాలుగు కాలేజీల్లో సంవత్సరానికి రూ.2.2 లక్షల నుంచి రూ.3 లక్షల వసూలు చేస్తున్నట్టు చెబుతున్నారు. రెండో కేటగిరీగా చెప్పుకునే కాలేజీల్లో కూడా కంప్యూటర్ సైన్స్‌కు ఏడాదికి రూ.1.7 లక్షల నుంచి నుంచి రూ.2 లక్షల వరకూ, మిగిలిన బ్రాంచీలకు రూ.లక్షన్నర వసూలు చేస్తున్నారు. ప్రముఖ కళాశాలల్లో కంప్యూటర్ సైన్స్, ఈసీఈ, ఐటీ వంటి కోర్సుల్లో సీట్లు అయిపోయాయి. రెండు, మూడు కేటగిరీలకు చెందిన కాలేజీల్లో మిగిలిన బ్రాంచీల్లో సీట్ల కోసం రూ.80 వేలు నుంచి లక్ష రూపాయలు వరకూ వసూలు చేస్తున్నారు. అయితే, ఆయా కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు కూడా ఆసక్తి చూపించకపోవడం గమనార్హం.

మానవ తప్పిదమే

... 5వ పేజీ తరువాయి

గుర్తించాల్సిన కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు అసలు సమాచారమే ఇవ్వలేదు. మీడియా ద్వారా విషయం తెలుసుకున్న అధికారులు మధ్యాహ్నం మూడు గంటలకు అక్కడకు బయలుదేరి వెళ్లారు. అంటే జరిగింది తప్పు అని, దానిని దాచి పెట్టాలని యాజమాన్యం యత్నించినట్టు చాలా స్పష్టంగా అర్థమైంది.

లెటర్ మొవిర్ తయారీలో లీకేజీ

లుపిన్ ఫార్మాలోని మల్టీ ప్రొడక్షన్ రెండో బ్లాకులో 'లెటర్ మొవిర్' మందు తయారుచేసిన తరువాత వ్యర్థాలను ఫిల్టర్ చేస్తున్నప్పుడు గుర్తు తెలియని విషవాయువులు వెలువడ్డాయి. అక్కడ తనిఖీకి వెళ్లిన షిఫ్ట్ ఇన్‌చార్జి సరైన మాస్క్ ధరించకపోవడం వల్ల ఆ వాయువు పీల్చి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే షీలానగర్‌లోని కిమ్స్‌కు తరలించారు. అయితే ఆ గది నుంచి విషవాయువులు వస్తున్నాయని ఎటువంటి హెచ్చరికలు చేయకపోవడం గమనార్హం. పక్క యూనిట్‌లో పనిచేస్తున్నవారు వెళ్లి అక్కడి వారిని రక్షించారు. అలా సాయపడిన వారికి ఇబ్బంది రావడంతో వారినీ ఆస్పత్రిలో చేర్చారు. మొత్తం ఆరుగురు కిమ్స్‌లో ఉన్నారు. బాధితులను చూడాలని యత్నిస్తే ఆస్పత్రి వర్గాలు అనుమతించకపోవడం గమనార్హం. ఆ సమయంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అక్కడికి రాగా బాధితులు ఆయన్ను చుట్టుముట్టారు. దాంతో ఘటన జరిగిన 18 గంటల తరువాత అంటే రాత్రి తొమ్మిది గంటల తరువాత కుటుంబ సభ్యులను ఆస్పత్రిలోకి అనుమతించారు. ఇవన్నీ చూస్తుంటే...ఏదో దాయాలని అన్ని వర్గాలు యత్నిస్తున్నాయనే విషయం స్పష్టమవుతోంది.

కఠిన చర్యలు తీసుకోవాలి

- మానవ హక్కుల వేదిక డిమాండ్

ఈ ఘటనపై మానవ హక్కుల వేదిక ఉమ్మడి విశాఖ ప్రధాన కార్యదర్శి కె.అనురాధ, సహాయ కార్యదర్శి జీథర్ రహమాన్‌లు స్పందించారు. కంపెనీలు ప్రమాద కారణాలను గోప్యంగా ఉంచడంపై చూపే శ్రద్ధ భద్రతపై పెట్టాలని సూచించారు. ఈ ప్రమాదానికి వ్యవస్థాపక కారణాలు అధికారికంగా వెల్లడించాలని, బాధితులకు ఉచిత వైద్యసేవలు, ఆర్థిక పరిహారం అందించాలని, యాజమాన్య ప్రతినిధులు, పరిశ్రమ భద్రతా అధికారులపై శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఫార్మా సిటీలో పబ్లిక్ అలర్ట్ వ్యవస్థ, ఆపత్కాల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కోరారు.

లెటర్‌మొవిర్ ఒక్కో మాత్ర రూ.2 వేలు

సైటోమెగలో వైరస్ (సీఎంవీ) ఇన్‌ఫెక్షన్ సోకిన వారికి, అవయవ మార్పిడి చేయించుకున్న రోగులకు లెటర్‌మొవిర్ మాత్రలు సిఫారసు చేస్తారు. ఈ మాత్ర ఒక్కొక్కటి రూ.2 వేలు. పది మాత్రల స్ట్రిప్ రూ.20 వేలకు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఈ మందు తయారీ సమయంలోనే విషవాయువు లీకైంది. అది ఏమిటన్నది ఇంకా గుర్తించలేదు. గత నెలలో వెలువడిన వాయువు ఏమిటో ఇప్పటివరకూ వెల్లడించలేదు. ఆ వాయువు ఆనవాళ్లు తెలుసుకోకూడదనే పీసీబీ అధికారులకు యాజమాన్యం తక్షణ సమాచారం ఇవ్వడం లేదు. వీటన్నింటిపై సమగ్ర విచారణ చేయాల్సి ఉంది.

సబ్ పోస్టాఫీసులో స్తంభించిన సేవలు

సర్వర్ పనిచేయకపోవడమే కారణం

రెండు రోజులుగా తిరుగుతున్నా ఫలితం లేకుండా పోతోందని వినియోగదారుల ఆవేదన

పెదగంట్యాడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి):

పెదగంట్యాడ సబ్ పోస్టాఫీసులో రెండు రోజులుగా సేవలు స్తంభించాయి. సోమ, మంగళవారాల్లో వివిధ సేవలనిమిత్తం పోస్టాఫీసుకు వచ్చిన ఖాతాదారులు నిరాశగా వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. సర్వర్ పనిచేయకపోవడంతో ఆన్‌లైన్ సేవలన్నీ నిలిచిపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. స్పీడ్ పోస్టుల బుకింగ్, బట్వాడా, పలు రకాల డిపాజిట్లతో పాటు విత్‌డ్రాలు, ఇలా ఆన్‌లైన్ సంబంధిత సేవలన్నీ స్తంభించిపోయాయని పలువురు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని అన్ని పోస్టాఫీసుల్లో ఆన్‌లైన్ సేవల ఆధునీకరణ పనులు జరుగుతున్నాయని, దీనివల్ల గతంలో ఉన్న సర్వర్లు పనిచేయడం లేదని, ఈ కారణంగానే రెండు రోజులుగా అరకొర సేవలు అందిస్తున్నామని పోస్టాఫీసు సిబ్బంది చెబుతున్నా.. వినియోగదారులు మాత్రం తమకు ఎలాంటి సేవలు లభించడం లేదని పేర్కొంటున్నారు.

ఇక్కడి పోస్టాఫీసుకు రోజూ 150 నుంచి 200 మంది వినియోగదారులు పలు సేవల నిమిత్తం వస్తుంటారు. ప్రతిరోజూ రూ.3.5 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఆర్థిక లావాదేవీలు జరుగుతాయి. అయితే సోమ, మంగళవారాల్లో ఈ కార్యకలాపాలు సర్వర్ పనిచేయక నిలిచిపోయాయి. కాగా గాజువాక, బీహెచ్‌పీవీ, మల్కాపురం, తదితర పోస్టాఫీసులకు వెళ్లినా ఇదే పరిస్థితి ఎదురవుతుందని పలువురు వినియోగదారులు తెలిపారు.



సబ్ పోస్టాఫీసులో ఖాళీగా ఉన్న కౌంటర్లు. (ఇన్‌సెట్లో) పని చేయని కంప్యూటర్లు

రెండు రోజులుగా తిరుగుతున్నా..

-ఎం.రాములునాయుడు, పోస్టాఫీసు ఖాతాదారుడు



రికరింగ్ డిపాజిట్ చేసేందుకు రెండు రోజులుగా పెదగంట్యాడ సబ్ పోస్టాఫీసుకు వచ్చి వెళుతున్నా. సెంట్రల్ సర్వర్ పనిచేయడం లేదని, అందువల్ల తాము ఇప్పుడు ఎలాంటి డిపాజిట్లు సేకరించలేమని సిబ్బంది చెబుతున్నారు. పోస్టల్ బుకింగ్‌కు కూడా అవకాశం లేకుండా పోయింది. సమీపంలోని పోస్టాఫీసులకు వెళ్లినా ఇదే పరిస్థితి ఎదురైంది. సంబంధిత అధికారులు సత్వరమే తగిన చర్యలు చేపట్టాలి.



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ గోపీకృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు

తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ

అగనంపూడి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలే బిడ్డకు మంచి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందిస్తాయని ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ అన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని నిర్వాసిత కాలనీల్లో గల అంగన్‌వాడీలు మంగళవారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. తల్లిపాలలో రోగ నిరోధక శక్తి అధికంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సాయి సరస్వతి, విజయకుమారి, సుబ్బలక్ష్మి, పైడితల్లి, తులసీ, తదితరులు పాల్గొన్నారు.

ప్లాంటులో ప్రైవేటు క్యాంటీన్లను మూసివేయాలి

నిర్వాహకులకు ఉక్కు యాజమాన్యం ఆదేశం

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో ప్రైవేటు క్యాంటీన్లను మూసివేయాలంటూ నిర్వాహకులకు ఉక్కు యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. ప్లాంటులో సుమారు 78 వరకు ప్రైవేటు క్యాంటీన్లు ఉన్నాయి. కొన్ని విభాగాల వద్ద స్టీల్ ప్లాంట్ క్యాంటీన్లు ఉండగా, మిగతా అన్ని విభాగాల వద్ద ప్రైవేటు క్యాంటీన్లు ఉన్నాయి. వీటితో పాటు పలు కీలక జంక్షన్లలో టీ-పాయింట్, టిఫిన్ సెంటర్లు, భోజనం హోటళ్లు ఉన్నాయి. వీటిలో దాదాపు 500 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం వీటిని మూసివేయాలని యాజమాన్యం ఆదేశించడంతో క్యాంటీన్ల నిర్వాహకులు, కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుండగా ప్లాంట్ క్యాంటీన్లలో సరైన సదుపాయాలు లేవని, ఈ క్రమంలో ప్రైవేటు క్యాంటీన్లను మూసివేయటం భావ్యం కాదని కార్మిక సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. ఈ అంశంపై ఉక్కు యాజమాన్యం పునరాలోచించాలని వారు కోరుతున్నారు.



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

డీఆర్‌సీ ట్రస్టు ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

పెందుర్తి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): దాడి రమణ చిట్టి (డీఆర్‌సీ) చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సంస్థ నిర్వాహకులు వైసీపీ 96వ వార్డు అధ్యక్షుడు దాడి ఉమామహేశ్వరరావు నేతృత్వంలో మంగళవారం పెందుర్తిలో మెగా వైద్య, రక్తదాన శిబిరాలను నిర్వహించారు. సుమారు 200 మందికి వైద్యులు పరీక్షలు చేయగా, ఉమామహేశ్వరావు ఉచితంగా మందులు పంపిణీ, రక్త దాతలకు సర్టిఫికెట్లను అందజేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన రోగులకు ఆర్థిక సహకారాన్ని అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

విభాగాధిపతికి అభినందనలు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ సీఎంఈ విభాగాధిపతిగా నూతనంగా నియమితులైన ఏకేదాస్‌ను ఇంటక్ ప్లాంట్ నాయకులు మంగళవారం కలిసి అభినందనలు తెలిపారు. ప్లాంటులో కీలక విభాగానికి హెచ్‌వోడీగా నియమితులవ్వడం ఎంతో ఆనందంగా ఉందని నాయకులు పేర్కొన్నారు. ఉద్యోగులు, కార్మికుల ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇంటక్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్, ప్లాంట్ యూనియన్ అధ్యక్షుడు పీవీ రమణ మూర్తి, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

గల్లవానిపాలెంలో 'తొలి అడుగు'

అగనంపూడి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి గల్లవానిపాలెం బూత్ నంబర్-7లో గల పలు ప్రాంతాల్లో మంగళవారం టీడీపీ శ్రేణులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు మహిళ వార్డు అధ్యక్షురాలు గల్లా హనిత పలువురు నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గల్లా సూర్యనారాయణ, గల్లా నరసింగరావు, జాజుల లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

శృతిమించకుండా వినాయక చవితి ఉత్సవాలు చేసుకుందాం

- **చింతలఅగ్రహారం, గవరపాలెం గ్రామాల పెద్దల నిర్ణయం**
- **పలుచోట్ల నిబంధనలు, హెచ్చరికలతో కూడిన ఫ్లెక్సీల ఏర్పాటు**

పెందుర్తిరూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయంటే నిర్వాహకులకు పోలీసులు పలు హెచ్చరికలు, సూచనలను జారీ చేస్తుంటారు. అయితే అందుకు భిన్నంగా మండలంలోని చింతలఅగ్రహారం గ్రామంలో ఈసారి గ్రామ పెద్దలే ఇటువంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించి పలు హెచ్చరికలు జారీ చేస్తూ గ్రామంలో పలుచోట్ల ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. చింతలఅగ్రహారం గ్రామాన్ని కలుపుకుని గవరపాలెం కాలనీ ఉంది. ఈ రెండు గ్రామాల్లో సుమారు 10 వేల మంది జనాభా ఉంటుంది. గణేశుని ఉత్సవాలను ఏటా ఈ గ్రామాల్లో యువకులు, విద్యార్థులు నిర్వహిస్తుంటారు. దాదాపు 50కి పైగా భారీ గణనాథుని విగ్రహాలను ప్రతిష్ఠిస్తుంటారు. పూజలు, నిత్యాన్నదానాలు చేస్తారు. అయితే ప్రతిష్ఠించిన గణేశుని ప్రతిమను నెల రోజులైనా నిమజ్జనం చేయని పరిస్థితి ఉంటుంది. డీజే సౌండ్లు, అసభ్యకర నృత్యాలు, బాణసంచా కాల్పులతో ఏదో ఒకరోజు విగ్రహాన్ని నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకువెళ్లేవారు. ఈ క్రమంలో మహిళలు, విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. చవితి సంబరాల్లో భక్తి కంటే నిర్వాహకుల సందడే శృతిమించేది. వీటికి కళ్లెం వేసేందుకు చింతలఅగ్రహారం గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఇరు గ్రామాల పెద్దలు, పలువురు యువకులు ఇటీవల సమావేశమై వినాయక ఉత్సవాల నిర్వహణపై పలు నిర్ణయాలు తీసుకున్నారు.



ఓ కూడలిలో గ్రామ పెద్దలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

- పదో తరగతిలోపు విద్యార్థులు చవితి ఉత్సవాలను నిర్వహించరాదు.
- ఉత్సవాల 9వ రోజునే గణేశుని విగ్రహాలను తప్పనిసరిగా నిమజ్జనం చేయాలి.
- సంప్రదాయబద్ధంగానే ఊరేగింపులు చేపట్టాలి.
- ఎవరైనా అశ్లీల నృత్యాలను ప్రదర్శించే ఏర్పాట్లు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.
- ఇందుకు సంబంధించి హెచ్చరికలతో కూడిన ఫెక్సీలను రెండు గ్రామాల్లో పలుచోట్ల ఏర్పాటు చేశారు.

గ్రామస్థుల నిర్ణయం పట్ల పెందుర్తి పోలీసులు హర్షం వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన 'పల్లా'

గాజువాక, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గాజువాక వుడా 130 ఫీట్ రోడ్డులో చేపట్టిన పలు అభివృద్ధి పనులను మంగళవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అధికారులతో కలిసి పరిశీలించారు. వీఎంఆర్డీఏ ప్రత్యేక నిధులతో నిర్మిస్తున్న ఐలాండ్ పనులను తిలకించారు. వీటితో పాటు గాజువాకలో పలు చోట్ల జరుగుతున్న పనులను పరిశీలించి, త్వరితగతిన నాణ్యతగా వాటిని చేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులు చేపట్టాలని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆయా పనులను అధికారులు నిరంతరం పరిశీలించాలని ఆదేశించారు. ఆయన వెంట టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, వీఎంఆర్డీఏ ఏఈ రాజు, డీఈఈ కాసా అప్పారావు, తదితరులు ఉన్నారు.

సామాజిక సేవల్లో బ్యాంకులు ముందుండాలి

పెదగంట్యాడ: సామాజిక సేవా కార్యక్రమాల్లో బ్యాంకులు ముందుండాలని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఐడీబీఐ బ్యాంక్ విశాఖ శాఖ రూ.2 లక్షల సీఎస్ఆర్ నిధులతో సమకూర్చిన కంప్యూటర్లు, ప్రింటర్లు, కుర్చీలు, టేబుళ్లు, బెంచీలు, తదితర సామగ్రిని 65వ వార్డు పరిధిలోని బాపూజీకాలనీ, భానోజీకాలనీ, సంజీవ కాలనీల్లో గల ప్రాథమిక పాఠశాలలకు అందజేశారు. ఈ సందర్భంగా సంజీవ కాలనీ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పల్లా మాట్లాడుతూ ప్రాథమిక విద్య ఎంత పటిష్ఠంగా ఉంటే విద్యారంగం అంత బలంగా ఉంటుందన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించేందుకు ప్రాథమిక విద్య పునాదిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు, ఐడీబీఐ బ్యాంక్ సీనియర్ జనరల్ మేనేజర్ కాన్వాడెడ్ దాస్, ఏజీఎం మౌషమి జెన, బీఎం ఎస్.రామశంకర్, టీడీపీ నాయకులు ఎస్.దేముడు, తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న పల్లా శ్రీనివాసరావు

పండ్ల తోటను ధ్వంసం చేశారని రైతు ఫిర్యాదు



నేలమట్టమైన పండ్ల మొక్కలు

పెందుర్తి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమిలో పదేళ్లుగా సాగులో ఉన్న తన పండ్ల తోటను పలువురు ఎక్స్‌కవేటర్‌తో ధ్వంసం చేసి వేళ్లతో సహా మొక్కలను పెకిలించి చేతికి అందాల్సిన ఫలాదాయాన్ని దక్కనివ్వకుండా చేశారని ఆరోపిస్తూ మండలంలోని సరిపల్లికి చెందిన రైతు గొర్లె ఈశ్వరరావు మంగళవారం పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈశ్వరరావు తమ ఆధీనంలో గల వ్యవసాయ భూమిలో పంట సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే హుద్‌హుద్ సమయంలో పంట కోల్పోయి తీవ్ర నష్టం రావడంతో ఉపాధి పథకం ద్వారా అందజేసిన పండ్ల మొక్కలతో పండ్ల తోటను పెంచుతున్నారు. జీడి, మామిడి ,అరటి, సపోటా, తదితర మొక్కలు పెంచుతున్నారు. కాగా మంగళవారం వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లేసరికి పండ్ల తోట నేలమట్టమవ్వడాన్ని చూసి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఎక్స్‌కవేటర్ సాయంతో పండ్ల మొక్కలను పెకళించినట్టు గుర్తించారు. తనపై గల రాజకీయ కక్షతోనే కొంతమంది పండ్ల తోటను ధ్వంసం చేసి, తనకు ఫలాదాయం దక్కకుండా చేశారని ఆరోపిస్తూ.. పలు ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శాఖాపరమైన విచారణ జరిపి తగిన చర్యలు చేపడతామని పోలీసులు తెలిపారు.

అక్క చూపిన బాటలో చెల్లి నేత్ర దానం

పెందుర్తి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తన మరణాంతరం నేత్ర దానంతో మరో ఇద్దరికి జీవితాల్లో ఆమె వెలుగులు నింపనున్నారు. పెందుర్తికి చెందిన రాపేటి చిన్నమ్మలు (70) సోమవారం రాత్రి మృతి చెందారు. అయితే 2016లో తన అక్క నాగయమ్మ మరణించినప్పుడు ఆమె నేత్రాలను దానం చేయడంతో ఇద్దరు చూపు పొందడాన్ని స్ఫూర్తిగా తీసుకుని చిన్నమ్మలు అప్పుడే తన కళ్లను దానం చేయాలని నిర్ణయించుకుంది. దీంతో ఇక్కడి సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు దాడి శ్రీనుని చిన్నమ్మలు కుటుంబీకులు నేత్ర దానం గురించి సంప్రదించారు. ఆయన ఎల్వీ ప్రసాద్ మోషన్ ఐ బ్యాంక్ వైద్యులతో మాట్లాడడంతో వారు మృతురాలి కళ్లను తీసి భద్రపరిచారు.

శొంఠ్యాంలో వృద్ధుడి కళ్లు..

అలాగే శొంఠ్యాంలో గవర పొలిపల్లి (66) అనే వృద్ధుడు మంగళవారం హృద్రోగంతో మృతి చెందడంతో సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు దాడి శ్రీను ఆయన కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించడంతో వారు మృతుడి కళ్లను దానం చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

కూర్మన్నపాలెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి ఎల్వీ నగర్ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. అందువల్ల ఎల్వీ.నగర్, కుంచుమాంబ కాలనీ, శ్రీనివాసనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అగనంపూడి: వీఎస్ఈజడ్ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అగనంపూడి సెక్షన్ ఏఈ లక్ష్మణ్ తెలిపారు. ఈ కార ణంగా అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీలు, పాత అగనంపూడి, శ్రీనివాసనగర్, శాంతినగర్, అన్నపూర్ణానగర్, గల్లవానిపాలెం, శనివాడ, జాబిలి హిల్స్, తలారివానిపాలెం, దువ్వాడ, లక్కరాజుపాలెం, యాతపాలెం, శివాజీనగర్, మంగళపాలెం, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, వెదుళ్లనరవ, గంగవరం, శెట్టిపాలెం, లంకివానిపాలెం, అజనగిరి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి తమకు సహకరించ వలసిందిగా కోరారు.

బ్రహ్మకుమారీస్ రక్షా బంధన్ వేడుకలు ప్రారంభం

అగనంపూడి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బ్రహ్మకుమారీస్ సంస్థ స్థానిక శాఖ ఆధ్వర్యంలో బీసీ కాలనీలో గల దివ్యజ్యోతి భవనంలో మంగళవారం రక్షా బంధన్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన సంస్థ ప్రతినిధి మాధురి రక్షా బంధన్ విశిష్టతను వివరించారు. అనంతరం ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ, టీడీపీ వార్డు అధ్యక్షుడు కర్రి దశేంద్ర, కూటమి నాయకలుఉ దాసరి త్రినాథ్, కె.జగదీశ్, డి.రమేశ్, కె.శ్రీనివాసరావు, బి.సత్యనారాయణలకు బ్రహకుమారీస్ ప్రతినిధులు రాఖీలు కట్టి స్వీట్లు పంపిణీ చేశారు.

అభయాంజనేయస్వామికి సింధూర పూజలు

వేపగుంట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 98వ వార్డు పరిధి అప్పన్నపాలెం బీఆర్‌టీఎస్ రహదారిలో గల శ్రీఅభయాంజనేయస్వామి ఆలయలో ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేకంగా సింధూర పూజలు, అర్చనలు చేశారు. మధ్యాహ్నం శ్రీనివాసరావు దంపతుల సహకారంతో భక్తులకు అన్న సమారాధన చేపట్టారు.

రెండున్నర టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

పెదగంట్యాడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీకి చెందిన బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని మంగళవారం రాత్రి న్యూపోర్టు పోలీసులు అరెస్టు చేసి రెండున్నర టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీఐ టి.కామేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రేషన్ బియ్యాన్ని బొలేరో వాహనంలో కొత్త దిబ్బపాలెం నుంచి వేరే ప్రాంతానికి తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు సీఐ కామేశ్వరరావు తమ సిబ్బందితో కొత్త దిబ్బపాలెం రహదారిపై వాహనాన్ని పట్టుకున్నారు. బియ్యం తరలిస్తున్న ఈసరపు నాని అనే వ్యక్తిని అరెస్టు చేశారు. బొలేరో వాహనంతో పాటు అందులో ఉన్న రెండున్నర టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఆయన పేర్కొన్నారు.

సంతోశ్‌కుమార్‌కు పంచకర్ల అభినందనలు

పెందుర్తిరూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా మండలంలోని చింతలఅగ్రహారం గ్రామానికి చెందిన కోరిబిల్లి సంతోశ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం ఉదయం సుజాతనగర్‌లోని జనసేన కార్యాలయం వద్ద ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును కలిశారు. సంతోశ్‌కు పంచకర్ల అభినందనలు తెలిపారు.



పంచకర్ల రమేశ్‌బాబుతో సంతోశ్‌కుమార్

హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలి

వైసీపీ పశ్చిమ కన్వీనర్ మళ్ల విజయప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న మళ్ల విజయప్రసాద్

ఎన్.ఎ.డి.జంక్షన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అమలు చేయాలని వైసీపీ పశ్చిమ కన్వీనర్ మళ్ల విజయప్రసాద్ డిమాండ్ చేశారు. కరాసలో మంగళవారం రాత్రి జరిగిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మట్లాడారు. ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయకపోవడం దారుణమన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ 52వ వార్డులో కూటమి నాయకుడొకరు ప్రతి అభివృద్ధి పనికి అడ్డు తగులుతున్నాడని, అధికారులను, వైసీపీ శ్రేణలును బెదిరిస్తున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు ఆల్ఫా కృష్ణ, మారుతి, విజయ్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

సాముహిక భగవద్గీత పారాయణం

వేపగుంట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి భరత్‌నగర్ సమీప శ్రీలక్ష్మీనరసింహ నగర్‌లో గల శ్రీగోపీజనవల్లభస్వామి ఆలయంలో ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం భక్తులు సామూహిక భగవద్గీత పారాయణాన్ని పఠించారు. అలాగే నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై గల శ్రీకల్యాణ వేంకటేశ్వరాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పలువురు భక్తులు సామూహిక భక్తి గీతాలను ఆలపించారు.

స్థలాల కోసం న్యాయ పోరాటం చేస్తున్నాం

విలేకరుల సమావేశంలో మాతృశ్రీ లేఅవుట్ బాధితులు



విలేకరుల సమావేశంలో బాధితులు

కూర్మన్నపాలెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86వ వార్డు పరిధి మాతృశ్రీ నగర్‌లో దశాబ్దాల క్రితం స్థలాలు కొనుగోలు చేసి మోసపోయామని, దీనిపై న్యాయ పోరాటం చేస్తున్నామని మాతృశ్రీ లేఅవుట్ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కూర్మన్నపాలెం సర్వే నంబర్-27లో మంగళవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరావు అనే బాధితుడు మాట్లాడుతూ తమ స్థలాలు ఆక్రమణలకు గురి కాకుండా షెడ్లు నిర్మిస్తున్నామే తప్పా తాము కబ్జాలకు పాల్పడడం లేదన్నారు. 1984లో సొసైటీ వద్ద స్థలాలు కొనుగోలు చేశామని, నాటి నుంచి అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయన్నారు. గత కొన్నేళ్లుగా ఈ సమస్యను ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. 65 మంది బాధితులం న్యాయం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో బాధితులు టీఎస్ వరప్రసాద్, అప్పారావు, కేఎస్ఎన్ గుప్తా, లక్ష్మణ్‌స్వామి, తదితరులు పాల్గొన్నారు.

రహదారి మధ్యలో గొయ్యి

ప్రమాదాల బారినపడుతున్న ద్విచక్ర వాహన చోదకులు



రైతు బజారు ఎదురుగా ఉన్న రోడ్డుపై ఉన్న గొయ్యి

గోపాలపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రహదారి మధ్యలో ఏర్పడిన గొయ్యి ప్రమాదాలకు కారణంగా నిలుస్తోంది. ఇప్పటికే ఈ గొయ్యి కారణంగా పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారినపడి గాయపడ్డారు. స్థానిక రైతు బజారు ఎదురుగా వేపగుంట నుంచి గోపాలపట్నం వచ్చే సర్వీస్ రోడ్డులో భూగర్భంలో కల్వర్టు ఉన్న చోట భారీ రంధ్రం ఏర్పడింది. గొయ్యి ఏర్పడిన చోట భూగర్భంలో కల్వర్టు ఉండడం వల్ల భారీ వాహనాల రాకపోకలతో ఈ గుంత మరింత పెద్దదైంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు వేగంగా రాకపోకలు సాగిస్తూ ఈ గొయ్యిని గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు. అందువల్ల సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే ఈ గోతిని పూడ్చివేయాలని పలువురు వాహనచోదకులు కోరుతున్నారు.

'కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి'

పెదగంట్యాడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేసి ఉద్యోగ విరమణ చేసిన వారికి కనీస పెన్షన్ కింద రూ.9 వేలు చెల్లించాలని పదేళ్లుగా పోరాటాలు సాగిస్తున్నా ప్రభుత్వ పట్టించుకోకపోవడం దారుణమని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.దీనబంధు అన్నారు. అసోసియేషన్ పెదగంట్యాడ శాఖ మంగళవారం సీడబ్ల్యూసీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో సేవలందించి పదవీ విరమణ తరువాత పేదరికంలో ఎంతోమంది కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్డ్ పర్సన్ భార్యాభర్తలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించాలని, రైలు ప్రయాణాల్లో 50 శాతం రాయితీ ఇవ్వాలని కోరారు. సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఎన్.రామారావు హయ్యర్ పెన్షన్ విధానాన్ని పెన్షనర్స్ పింఛన్‌దారులందరికీ వర్తింపచేయాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు కణితి అప్పలరాజు, పులి వెంకటరమణారెడ్డి, ఎన్.అప్పలనాయుడు, గోపీనారాయణ, వెంకటరావు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ ములగాడ మండల కార్యవర్గం

మల్కాపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూ) ములగాడ మండల నూతన్య కార్యవర్గాన్ని మంగళవారం ఇక్కడి జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవాధ్యక్షుడిగా తాహిర్ అన్సారీ, అధ్యక్షుడిగా బి.సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా వై.ఫణీంద్రకుమార్, మహిళా అధ్యక్షురాలిగా భారతీకుమారి ప్రైస్, కోశాధికారిగా వైఏం వసంతకుమారి, జీవీఎంసీ ప్రతినిధిగా బి.స్రవంతిలను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా కె.నాగేశ్వరరావు, పి.హరికృష్ణ, ఎం.లక్ష్మణరెడ్డిలు వ్యవహరించారు.

ఘనంగా మంగళగౌరీ వ్రతాలు

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాస ఏకాదశిని పురస్కరించు కుని తుంగ్లాం గ్రామ దేవత ముత్యాలమ్మ ఆలయంలో మంగళగౌరీ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు దేవీశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక మహిళలతో సామూహిక మంగళగౌరీ వ్రతాలు చేయించారు. పూజల్లో కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి దంపతులతో పాటు కాలనీ నాయకులు నావన సింహచలం, కొల్లి అప్పలరెడ్డి, ఎస్.అచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి-రూరల్: శ్రావణ ఏకాదశి సందర్భంగా మండలంలోని చింతలఅగ్రహారం రామాలయంలో మంగళగౌరీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన అర్చకుడు ఎం.భాస్కరశర్మ, గిరిశర్మల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పసుపు, కుంకుమపూజలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ కాళ్ల వరలక్ష్మి, సర్పంచ్ దాడి గోపీ అప్పలనాయుడు, గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు మద్దాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **సార్, మేడమ్** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **కింగ్డమ్** : జగదాంబ
- **సన్ ఆఫ్ సర్దార్** : రమాదేవి
- **మహావతార్ నరసింహ** : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **హరిహర వీరమల్లు** : శారద, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 44, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 38, పచ్చిమిర్చి 56, కాకరకాయలు 32, బీరకాయలు 42, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 16, క్యారెట్ 44, దొండకాయలు 40, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 74, బరబాటి 32, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 50, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 84, కీరదోస 30, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 42, దేముడు చిక్కుడు 102, గోరు చిక్కుడు 38, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	475
విజయనగరం	479
శ్రీకాకుళం	479

చికెన్ ధరలు

బ్రాయిలర్

రైతు ధర	85
లైవ్ ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	190



సీఎం చంద్రబాబుకు ఆహ్వానపత్రిక అందిస్తున్న సుజయ్‌కృష్ణ రంగారావు

సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

» ఏపీఎల్ ప్రారంభోత్సవానికి రావాలని నిర్వాహకుల వినతి

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా ఈ నెల 8 నుంచి జరగనున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-4కు హాజరుకావాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీ, విద్యాశాఖల మంత్రి లోకేశ్‌లను ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ సుజయ్‌కృష్ణ రంగారావు మంగళవారం ఆహ్వాన పత్రిక అందజేసి ఆహ్వానించారు. దీనిపై మంత్రి లోకేశ్ స్పందిస్తూ సమయం లభిస్తే హాజరవుతానని, టోర్నీని విజయవంతంగా నిర్వహించాలన్నారు.

ఏయూలో క్వాంటం కంప్యూటింగ్‌పై ఎఫ్‌డీపీ

» 28 నుంచి సెప్టెంబరు ఒకటో తేదీ వరకు నిర్వహణ



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న వీసీ రాజశేఖర్

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కొత్తగా ప్రవేశపెట్టిన క్వాంటం కంప్యూటింగ్ కోర్సుకు సంబంధించి వారం రోజులపాటు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డీపీ) నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను తన కార్యాలయంలో మంగళవారం వీసీ జీపీ రాజశేఖర్ విడుదల చేశారు. ఆగస్టు 28 నుంచి సెప్టెంబరు ఒకటో తేదీ వరకు క్వాంటం కంప్యూటింగ్ ఇన్‌సైట్స్ ఫర్ అకడమీషియన్స్ కాన్సెప్ట్, అప్లికేషన్స్ అండ్ టూల్స్ అనే అంశంపై కంప్యూటర్ సైన్స్ సిస్టమ్ ఇంజనీరింగ్ విభాగం సమావేశ మందిరంలో ఈ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తారు. బోధనా సిబ్బంది, పరిశోధకులకు మరింత జ్ఞానాన్ని అందించేలా కార్యక్రమాన్ని రూపొందించారు. అధ్యాపకుల్లో నైపుణ్యం పెంపొందించడం, వర్తమాన సమాజ అవసరాలు, సమస్యలకు పరిష్కారాలను అన్వేషించే దిశగా పనిచేయడంపై నిర్దేశిస్తారు. ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు, విభిన్న పరిశ్రమలకు చెందిన నిపుణులు శిక్షణ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు, ఎఫ్‌డీపీ కన్వీనర్ కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ

పెదగంట్యాడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మేనేజ్‌మెంట్ల పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు ఇన్‌స్పైర్-మనాక్-2025 శిక్షణను బుధ, గురువారాల్లో నిర్వహిస్తున్నట్టు జిల్లా సైన్స్ అధికారి పి.రాజారావు తెలిపారు. డివిజన్ల వారీగా డీఈవో కార్యాలయంలో జరిగే శిక్షణకు ప్రభుత్వ, జడ్పీ, ప్రైవేటు, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్, కేజీబీవీ మోడల్ స్కూళ్ల సైన్స్ ఉపాధ్యాయులంతా తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. బుధవారం ఆనందపురం, పద్మనాభం, భీమిలి, చినగదిలి, సీతమ్మధార మండలాల ఉపాధ్యాయులకు గురువారం విశాఖ డివిజన్‌లోని గాజువాక, పెదగంట్యాడ, పెందుర్తి, ములగాడ, గోపాలపట్నం, మహారాణిపేట మండలాల సైన్స్ ఉపాధ్యాయులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ ఉంటుందన్నారు.

విశాఖతో విడదీయరాని బంధం

» 'కళ్లు' చిత్రాన్ని తెరకెక్కించింది ఇక్కడే

» 1959 నుంచి నగరంతో అనుబంధం

» 70కు పైగా చిత్రాలకు సినిమాటోగ్రాఫర్‌గా అనుభవం

» సిరివెన్నెల, కళ్లు చిత్రానికి నంది అవార్డులు

ప్రముఖ సినిమాటోగ్రాఫర్ మాడపాక వెంకట రఘు

సిరిపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి):

విశాఖతో విడదీయరాని బంధం ఉంది. పుట్టింది విజయవాడలోనే అయినా ఐదేళ్ల వయసు నుంచే గురుద్వార వద్ద ఉన్న మామయ్య ఇంటికి, భీమిలి సమీపంలో ఉండే మేనత్త ఇంటికి వచ్చేవాడిని. చిన్నప్పటి నుంచీ సముద్రమంటే ఎంతో ఇష్టం. ఎస్.గోపాల్‌రెడ్డి వద్ద అసిస్టెంట్‌గా పనిచేసే సమయంలో ముద్దమందారం సినిమాలో అధికశాతం ఇక్కడే చిత్రీకరించాం. వంశీ దర్శకత్వంలోని డిటెక్టివ్ నారద తీసేటప్పుడూ చాలా కాలం విశాఖలోనే ఉన్నా. దర్శకుడిగా బాధ్యతలు చేపట్టిన తొలి చిత్రం కళ్లు ఇక్కడే చిత్రీకరించాను. విశాఖ తీరం, భీమిలి ఎర్రమట్టి దిబ్బలు, అరకు అందాలు కట్టిపడేస్తాయి అన్నారు ప్రముఖ సినిమాటోగ్రాఫర్, దర్శకుడు మాడపాక వెంకట రఘు (ఎంవీ రఘు). ఇటీవల నగరానికి వచ్చిన ఆయన విశాఖతో తన అనుబంధాన్ని, 50 ఏళ్ల సినీ ప్రస్థానాన్ని 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.



విశాఖలో జరిగిన కళ్లు చిత్రం షూటింగ్‌లో నటులకు సీన్ వివరిస్తున్న దర్శకుడు ఎంవీ రఘు




కెమెరాతో సినిమాటోగ్రాఫర్ రఘు

సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తుండగానే దర్శకత్వం వహించాలనే కోరిక పుట్టింది. దీంతో గొల్లపూడి మారుతీరావు తన కళ్లు నాటకాన్ని అందించడంతో అదే పేరుతో కేవలం రూ.7.5 లక్షల బడ్జెట్‌లో విశాఖలోనే సినిమాను తెరకెక్కించాను. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చేతులమీదుగా ఉత్తమ తొలి దర్శకుడిగా నంది అవార్డు అందుకోవడం జీవితంలో మరచిపోలేని సంఘటన అన్నారు. తండ్రి చిన్నయ్యతో ఉన్న స్నేహం కారణంగా గాయకుడు పిఠాపురం నాగేశ్వరరావు సిఫారసు మేరకు కెమెరామన్ వీఎస్ఆర్ స్వామి వద్ద 1967లో సహాయకునిగా చేరాను. తొలి చిత్రం గృహప్రవేశంతో సినిమా రంగంలో ప్రవేశించారు. దర్శకుడి ఊహకు తగ్గట్టుగా సన్నివేశాలను తెరకెక్కించడమే కాకుండా ప్రేక్షకులను కట్టిపడేసేలా మరింత అందంగా చూపించాల్సిన బాధ్యత సినిమాటోగ్రాఫర్‌ది. గతంలో రీలింగ్ ఎక్కువ. క్లోజ్ షాట్, ఫుల్‌షాట్, లాంగ్..ఓవర్‌లాల్ కవర్డ్ తదితర షాట్స్ ఉండేవి. ప్రస్తుతం అధునాతన టెక్నాలజీ వచ్చింది దానిని సద్వినియోగం చేసుకోవాలి.

కళ్లు చిత్రం తీసే సమయంలో విశాఖలో అభివృద్ధి మొదలయింది. నాలోని భావానికి తగిన విధంగా తగరపువలసలోని ఒక గుడి దొరికింది. తక్కువ వ్యవధిలోనే సినిమా పూర్తిచేశారు. స్థానిక నటీనటులతో పాటు అవుట్‌డోర్ యూనిట్ పనులన్నీ తక్కువ బడ్జెట్‌లో సహజ అందాలున్న విశాఖలోని తీయగలిగాం. ఈ సినిమాకు కేవలం రూ.7.5 లక్షలు మాత్రమే వెచ్చించాం. తెల్లవారుజామున విశాఖ అందాలను చూసి తీరాల్సిందే. దేవాలయాల నుంచి భక్తి గీతాలు, సహజమైన ప్రకృతి సోయగాలు, ఎర్ర మట్టి దిబ్బలు విశాఖ సొంతం. ఇప్పటివరకు 70 చిత్రాలకు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేశా. తొలి సినిమా చిరంజీవి నటించిన మగమహారాజుతో పాటు అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్ తదితర గొప్ప నటీనటులతో పనిచేసే అవకాశం లభించింది. సిరివెన్నెల చిత్రానికి ఉత్తమ సినిమాటోగ్రాఫర్‌గా నంది అవార్డును అందుకున్నా.

గిరిజన రైతులకు విరివిగా రుణాలందించాలి

» పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్



రైతు సంఘాల నేతలకు చెక్కు అందజేస్తున్న మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే పంచకర్ల

ఎన్.ఎ.డి.జంక్షన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజన ప్రాంత రైతులకు డీసీసీబీ ద్వారా విరివిగా రుణాలు ఇవ్వాలని పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన రైతు సహకార సంఘాల ఆత్మీయ సమావేశానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సహకార సంఘాల ద్వారా ఎరువులు, యాపీఏసీ గొడౌన్లు నిర్మించేందుకు ఆర్థిక సహకారం అందించి సంఘాల బలోపేతానికి కృషి చేయాలన్నారు. డీసీసీబీ రూ.2,400 కోట్ల టర్నోవర్‌ను రూ.3,000 కోట్లకు చేర్చేందుకు ఉద్యోగులంతా సమష్టిగా కృషిచేయాలని సూచించారు. అంతకుముందు మంత్రి ప్రమాదవశాత్తు మృతి చెందిన రైతుల కుటుంబాలకు, వివిధ సంఘాలకు రూ.257 కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ సహకార సంఘాల బలోపేతాన్ని దృష్టిలో పెట్టుకుని రుణాల మంజూరులో జాప్యం లేకుండా చూడాలన్నారు. డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు మాట్లాడుతూ గతంలో సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన రూ.4 కోట్ల బకాయిలను ప్రభుత్వం నుంచి విడుదల చేయాల్సిందిగా మంత్రికి విజ్ఞప్తి చేశారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో డీవీఎస్ వర్మ, జీఎంలు అన్నపూర్ణ, బి.శ్రీనివాసరావు, డీజీఎం ఎం.అశోక్‌కుమార్, ఎల్.అప్పలరావు, ఎం.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు తగిన విశ్రాంతి ఇవ్వాలి

» ఆన్‌లైన్ పర్యవేక్షణ తప్పనిసరి

» జాయింట్ లేబర్ కమిషనర్ రామారావు

అక్కయ్యపాలెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రవాణా రంగంలో పనిచేసే డ్రైవర్లు, క్లీనర్లకు తగిన విశ్రాంతి ఇవ్వాలని, పని ప్రాంగణంలో వసతి సౌకర్యాలు కల్పించాలని కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ ఎం.రామారావు సూచించారు. అక్కయ్యపాలెంలోని కార్మికశాఖ కార్యాలయంలో డీసీఎల్, ఏసీఎల్, ఏఎల్ఓ, రవాణా రంగానికి చెందిన ప్రతినిధులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు వాహనాలను నడిపే డ్రైవర్లకు నిర్దిష్టమైన పనిగంటలు అమలుచేయాలని, తగిన విశ్రాంతి ఇవ్వాలన్నారు. వివిధ వసతులు, సౌకర్యాలు కల్పించాలన్నారు. ఓవర్‌టైమ్ అనుమతించరాదని, ఆరోగ్య భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. వీటిని కార్మికశాఖ అధికారులు ఆన్‌లైన్‌లోనే తనిఖీ చేసి నివేదిక సమర్పించాలన్నారు. ప్రతి ఉద్యోగికి డిజిటల్ రికార్డ్ నిర్వహించాలని యజమానులకు సూచించారు. ఈ సమావేశంలో డీసీఎల్ ఎం.సునీత, ఏసీఎల్, ఏఎల్‌వోలు పాల్గొన్నారు.

9న అప్పన్నకు కరాళ చందన సమర్పణ

సింహాచలం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహ స్వామికి ఈనెల 9వ తేదీన పైపూతగా కరాళ చందన సమర్పించనున్నారు. ఏటా స్వామికి నాలుగు విడతల్లో శ్రీచందనపు ముద్దను సమర్పించిన తరువాత శ్రావణమాస శుక్లపక్ష పౌర్ణమి రోజున కరాళ చందనం సమర్పించడం ఆచారం. ఈ నేపథ్యంలో మంగళవారం చందనం అరగదీతకు శ్రీకారం చుట్టారు. ఐదు కిలోల గంధపు ముద్దను సిద్ధం చేసి, రెండు కిలోల తిరుమణి, సుగంధ ద్రవ్యాలను మిళితం చేసి స్వామికి సమర్పిస్తారు.

'కూటమిది అనైతిక రాజకీయం'

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్ర జ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలో గెలిచేందుకు కూటమి పార్టీలు అనైతిక రాజకీయాలకు పాల్పడుతున్నాయని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకేరాజు ఆరోపించారు. నోటుతో రాజకీయం చేస్తున్నారన్నారు. ఓటమి భయంతోనే కార్పొరేటర్లను క్యాంప్‌నకు తరలించారన్నారు. పార్టీ ఫిరాయించిన 27 మందికి ఓటు హక్కు తొలగించి ఎన్నిక నిర్వహించాలని డిమాండ్ చేశారు. కూటమి నేతల మధ్య విభేదాలతోనే కార్పొరేటర్లను తరలించారని ఆరోపించారు.

కేర్ ఆస్పత్రిలో రోబోటిక్ శస్త్రచికిత్సలు

» 12 గంటల్లో 10 మందికి మోకాలి మార్పిడి ఆపరేషన్లు



శస్త్రచికిత్స నిర్వహిస్తున్న వైద్యులు

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని కేర్ ఆస్పత్రిలో అత్యంత వేగంగా మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలను నిర్వహించారు. రాష్ట్రంలోనే ఇది తొలిసారి అని ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు. దీనికి సంబంధించిన వివరాలను ఆస్పత్రి చీఫ్ రోబోటిక్ మోకాలి మార్పిడి సర్జన్ డాక్టర్ వి.రవిచంద్ర వెల్లడించారు. ఆస్పత్రిలో 12 గంటల వ్యవధిలో వెలిస్ రోబోటిక్ సిస్టమ్ సహాయంతోపది రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సల ను విజయవంతంగా చేశామన్నారు. డాక్టర్ రఘు యల వర్తి, డాక్టర్ రాజు నాయుడు, డాక్టర్ అజయ్ సహకరించారన్నారు. రోబోటిక్ టెక్నాలజీతో శస్త్ర చికిత్స కచ్చితంగా రోగులకు అనుకూలంగా మారిందన్నారు. పది మంది రోగులు తక్కువ నొప్పితో, త్వరగా కోలుకుని తిరిగి పనుల్లోకి వెళ్లగలిగారన్నారు. కేర్ ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మయాంక్ చౌదరి మాట్లాడుతూ శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించడం ద్వారా మరోసారి వైద్యుల నైపుణ్యం, ఆధునిక చికిత్సల పట్ల నిబద్ధతను తెలియజేసినట్టయిందన్నారు. ఇది మోకాలి శస్త్రచికిత్సలో సరికొత్త ప్రమాణంగా నిలుస్తుందన్నారు.

ప్రధానోపాధ్యాయుల సంఘం నూతన కార్యవర్గం



విజయసంకేతం చూపిస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘానికి నూతన కార్యవర్గం ఏర్పడింది. దీనికి కాలపరిమితి రెండేళ్లు. సంఘం గౌరవాధ్యక్షునిగా శొంఠ్యాం జడ్పీ స్కూలు హెచ్ఎం ఎ.జోగారావు, అధ్యక్షునిగా గోపాలపట్నం హెచ్ఎం వైవీఎస్ వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా అనంతవరం హెచ్ఎం ఎంవీ కృష్ణకుమార్, కోశాధికారిగా డాబాగార్డెన్స్ ఎంజీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఆర్‌వీవీఎస్ నాగభూషణం ఎన్నికయ్యారు. ఇంకా ఉపాధ్యక్షులుగా డి.శ్రీనివాసరావు, టి.మధు, సంయుక్తకార్యదర్శులగా ఎం.వెంకటరావు, వి.వెంకటరావు, రాష్ట్ర కమిటీ కౌన్సిలర్లుగా కె.రామాంజనేయ పి.జ్యోతి, కె.శ్రీనివాసరావు, ఇతర సభ్యులు ఎన్నికయ్యారు.

అప్పన్న లడ్డూ ప్రసాదం తయారీ పరిశీలన



లడ్డూ తయారీని పరిశీలిస్తున్న ఈవో వేంద్ర త్రినాథరావు

సింహాచలం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహ స్వామి భక్తులకు విక్రయించే లడ్డూ ప్రసాదం తయారీ, నాణ్యతను ఈవో వేంద్ర త్రినాథరావు మంగళవారం పరిశీలించారు. దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు రాష్ట్రంలోని అన్ని ప్రధాన ఆలయాల్లో దిట్టం ప్రకారం 20 కిలోల పంచదార, 10 కిలోల శనగపిండి, 750 గ్రాముల జీడిపప్పు, 500 గ్రాముల కిస్‌మిస్,75 గ్రాముల ఏలకుల పొడి, 15 గ్రాములజాజికాయ పొడి, 150 గ్రాముల పచ్చకర్పూరం, ఆరు కిలోల నెయ్యితో పాకం చేయాలని, ఒక పాకానికి 510 లడ్డూలు తయారు చేయాల్సి ఉంటుందన్నారు. ట్రయల్ రన్‌లో భాగంగా మూడు పాకాలను తయారు చేయించామన్నారు. నివేదికను కమిషనర్‌కు పంపుతామన్నారు. 400 గ్రాముల కల్యాణ లడ్డూ విక్రయాలను త్వరలో పునరుద్ధరిస్తామన్నారు. ఏఈఓ వి.రమణమూర్తి, సత్య శ్రీనివాస్, నరసింగరావు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో వైసీపీ జడ్పీటీసీ సభ్యుల భేటీ

» వైసీపీ పెద్దల ఆదేశాలతో సన్మానానికే పరిమితం



కర్రి సత్యం దంపతులను సత్కరిస్తున్న జడ్పీటీసీ సభ్యులు

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం మామిడిపల్లిలో మంగళవారం జిల్లాలోని వైసీపీ జడ్పీటీసీ సభ్యులు ఫోరం అధ్యక్షుడు కర్రి సత్యం అధ్యక్షతన సమావేశమయ్యారు. జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రకు వ్యతిరేకంగా చర్చించేందుకు వీరంతా సమావేశమవుతున్నారని తెలిసి వైసీపీ పెద్దలు జోక్యం చేసుకున్నారని సమాచారం. దీంతో జడ్పీటీసీ సభ్యులఫోరం అధ్యక్షుడిగా ఎన్నికైన కర్రి సత్యం సన్మానంతో భేటీని ముగించారని తెలిసింది. సమావేశానికి 22 మంది జడ్పీటీసీసభ్యులు వచ్చారని కర్రి సత్యం వర్గీయులు చెబుతుండగా, కేవలం 12 మంది మాత్రమే హాజరయ్యారని చైర్‌పర్సన్ వర్గీయులు వెల్లడించారు. సన్మాన కార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్మన్ సుంకరి గిరిబాబు, జడ్పీటీసీ సభ్యులు ఈర్లె అనురాధ, పెంటకోట స్వామి సత్యనారాయణ, డాక్టరు వెంకటలక్ష్మి, పలువురు మహిళా జడ్పీటీసీ సభ్యుల తరపున వారి భర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కర్రి సత్యం మాట్లాడుతూ ఫోరం అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా విందు ఇచ్చానని, చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెడితే సభ్యులకు తాయిలాలు అందిస్తామన్న వదంతుల్లో వాస్తవం లేదన్నారు. కాగా భేటీలో కొందరు జడ్పీ చైర్‌పర్సన్‌పై అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. సమావేశానికి వెళ్లొద్దని సూచించారని, దీంతో వారిలో భయం నెలకొందని మరో సభ్యుడు వ్యాఖ్యానించినట్టు సమాచారం.

క్రైం... crime news

గోస్తనీ నదిలో దూకి విద్యార్థి ఆత్మహత్యాయత్నం

» రక్షించి, కౌన్సెలింగ్ చేసిన పోలీసులు

తగరపువలస, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గోస్తనీనది వంతెన పై నుంచి దూకి విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసులు అతడిని రక్షించి, కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. తగరపువలసలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల సెకండియర్ విద్యార్థి సెల్‌ఫోన్‌లో అశ్లీల చిత్రాలు చూస్తున్నట్టు గుర్తించిన లెక్చరర్ ఫోన్ లాక్కుని మందలించారు. దీంతో మనస్తాపానికి గురై వంతెనపైకి వచ్చి నదిలో దూకాడు. సమీపంలో ఉన్న ట్రాఫిక్ ఎస్ఐ పి.చిరంజీవిరావు సిబ్బందిని అప్రమత్తం చేసి తాళ్లను నదిలో జారవిడిచారు. ఎస్ఐ రాధాకృష్ణ చేరుకొని విద్యార్థిని బయటకు తీశారు. విజయనగరానికి చెందిన విద్యార్థి తల్లిదండ్రులను రప్పించి కౌన్సెలింగ్ ఇచ్చారు. రెండు సబ్జెక్టులు పోయాయనే మనస్తాపంతోనే ఈ నిర్ణయం తీసుకున్నానని విద్యార్థి చెప్పాడు. సీఐ బి.తిరుమలరావు విద్యార్థితో పాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

తిక్కవానిపాలెం తీరంలో వ్యక్తి మృతదేహం



నాగేశ్వరరావు (ఫైల్)

కూర్మన్నపాలెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తిక్కవానిపాలెం సముద్ర తీరానికి ఓ వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చినట్టు దువ్వాడ సీఐ కె.మల్లేశ్వరరావు తెలిపారు. అనకాపల్లి మండలంగోపాలపురానికి చెందిన గొర్లె నాగేశ్వరరావు (30) ఈ నెల 3న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోవడంతో అనకాపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం తిక్కవానిపాలెం తీరానికి మృతదేహం కొట్టుకురావడతో కుటుంబసభ్యులు పరిశీలించి నాగేశ్వరరావుగా గుర్తించారు. స్నానం చేసేందుకు వెళ్లి మృతి చెంది ఉంటాడని తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రిప్టో లావాదేవీల కేసులో నిందితుడి అరెస్టు

ఎండాడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నకిలీ డాక్యుమెంట్లు, బ్యాంకు ఖాతాలు, ఫేక్ కంపెనీలతో క్రిప్టో లావాదేవీలను నిర్వహించిన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఘజియాబాద్‌కి చెందిన రాజీవ్ బన్సల్‌ను సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని ప్రముఖ వైద్యుడికి పెట్టుబడుల పేరుతో వాట్సాప్ గ్రూపులలో మెసేజ్‌లు పెట్టి అతడి నుంచి రూ.2.61 కోట్లు కొల్లగొట్టిన సంగతి తెలిసిందే. ఈ కేసులో సైబర్ క్రైం సీఐ భవానీ ప్రసాద్, ఎస్ఐ మహేశ్వరరావు నిందితుడ్ని ఢిల్లీలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు రాజీవ్ బన్సల్ అసలు పేరు సలీంఖాన్ (32) సోనూ యాదవ్‌గా పేరు మార్చుకుని నకిలీ సర్టిఫికెట్లు తయారుచేసి ఎల్‌జీ, సామ్‌సంగ్ సంస్థల్లో సేల్స్ మేనేజర్‌గా పనిచేశాడు. ఆ తరువాత రాజీవ్‌బన్సల్‌గా మార్చుకుని 58 బ్యాంకులలో ఖాతాలను తెరిచి సైబర్ నేరగాళ్లకి అందజేశాడు. అతడి నుంచి నోట్ ప్యాడ్, బ్యాంకు ఖాతాల పుస్తకాలు, చెక్‌బుక్స్, ఫోన్లు, ఏటీఎం కార్డులు, నకిలీ పాన్, ఆధార్ కార్డులు, స్టాంపులు 18 సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి అదృశ్యం



గోవిందరాజు (ఫైల్)

పెందుర్తి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కోర్టుకు బయలుదేరిన రియల్ ఎస్టేట్ వ్యాపారి తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆమె కుమార్తె మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేపగుంట అప్పన్నపాలేనికి చెందిన కలవలపల్లి గోవిందరాజు (60) రియల్ ఎస్టేట్ వ్యాపారి. అనకాపల్లి కోర్టుకు బయలుదేరి తిరిగి రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

జగదాంబ థియేటర్ అధినేత రాంబాబు కన్నుమూత



జగదాంబ రాంబాబు

మహారాణిపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జగదాంబ థియేటర్ అధినేత వేగి భద్రాచలం (జగదాంబ రాంబాబు) (89) మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో రామ్‌నగర్ జంక్షన్‌లోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా హృదయ సంబంధిత సమస్యలున్నప్పటికీ వయోభారంతోనే మృతిచెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయనకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలున్నారు. అతని అసలు పేరు భద్రాచలం. యల్లమ్మతోటప్రాంతంలో 1970 అక్టోబరులో జగదాంబ 70ఎంఎం సినిమా హాల్‌ను ప్రారంభించారు. ఈ థియేటర్ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోనే పేరు ప్రఖ్యాతులు సాధించింది. అనంతరం కూడలి జగదాంబ జంక్షన్‌గా రూపాంతరం చెందింది. సినీ చరిత్రలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన తెలుగు, హిందీ, ఇంగ్లీష్ సినిమాలు మాత్రమే ఈ థియేటరులో ప్రదర్శించేవారు. జగదాంబ థియేటర్‌లో సినిమా ప్రదర్శించడం హీరోలతో పాటు సినీ పరిశ్రమకు చెందిన ప్రతి ఒక్కరూ గొప్పగా భావిస్తారు. ఈ థియేటర్ కాంప్లెక్స్‌లోనే శారదా, రమాదేవి థియేటర్లను ప్రారంభించారు.